ప్రజావాణి దరఖాస్తులు
ప్రజలనుండి కుప్పలు
కొంతనైనా తగ్గుతుందా
కొత్త ఏడు తిప్పలు

చురక

మౌనంగా ఎవరున్నా
మార్పు మందగమనం
ప్రశ్నించకుంటే లేదు
ప్రజా ప్రగతి భ్రమణం

-వేల్పుల నారాయణ
9440433475

నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

కొత్త సంవత్సరం వేళ.. జపాన్‌ను వణికిస్తున్న భారీ భూకంపం

– సునామీ హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ సంస్థ

– ఉత్తర కొరియా రష్యాల కు కూడా సునామీ హెచ్చరికలు జారీ

టోక్యో జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కొత్త సంవత్సరం వేళ.. జపాన్ ను భారీ భూకంపం వణికించింది. ఇషికావా రాష్ట్రంలో సోమవారం 7.6 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించాయి. దీంతో జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. తీర రాష్ట్రాలైన ఇషికావా, నీగటి, తొయామా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఇషికావాలో సుమారు 5 మీటర్ల ఎత్తు వరకు సునామీ అలలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు వెదర్ ఏజెన్సీ తన వార్నింగ్‌లో తెలిపింది. హ్వాక్కియాడా నుంచి నాగసాకి మధ్య జపాన్ సముద్రతీరం వెంట సుమారు మూడు మీటర్ల ఎత్తులో సునామీ అలలు వచ్చే అకాశాలు ఉన్నాయి. భారీ భూకంపం నేపథ్యంలో ఉత్తర కొరియా రష్యాల కు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆ రెండు దేశాలకూ పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ హెచ్చరికలు జారీ చేసింది.

హైదరాబాద్ మంగళవారం 2-1-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి:30 సంచిక:123 పేజీలు:6 వెల: రూ.1/-

నుమాయిష్‌ను ప్రారంభించిన రేవంత్ రెడ్డి..

హైదరాబాద్, జనవరి 1:నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నుమాయిష్ ప్రారంభమైంది. నుమాయిష్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. నేటి నుంచి ఫిబ్రవరి 15వ తేదీ దాకా నుమాయిష్ కొనసాగనుంది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ప్రతి సంవత్సరం జనవరి 1వ తేది నుంచి ఫిబ్రవరి 15వ తేది వరకు 46 రోజుల పాటు కొనసాగుతుంది.

దాదాపు 2400 స్టాళ్లను ఏర్పాటు చేశారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, ఫుడ్ కోర్టులు, వివిధ పారిశ్రామికవేత్తల ఉత్పత్తి అమ్మకాలు చేపట్టేందుకు స్టాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. నుమాయిష్‌కు వచ్చే సందర్శకులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టారు. పోలీస్, అగ్ని మాపక శాఖ అప్రమత్తంగా ఉండి నుమాయిష్ విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపడంతో పాటు మెట్రో రైలు వేళలను పొడిగించారు.

రేవంత్‌కు కొత్త సంవత్సర శుభాకాంక్షల వెల్లువ

హైదరాబాద్, జనవరి 1:కొత్త సంవత్సరం రోజున సెక్రటేరియట్ లో హంగామా కనిపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రముఖులు, అధికారులు కలిసి కొత్త సంవత్స శుభాకాంక్షలు తెలిపారు.. మంత్రి సీతక్క రేవంత్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ కు ఇందిరా గాంధీ ఫొటోను గిఫ్ట్ గా ఇచ్చారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ రేవంత్ రెడ్డిని కలిసి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు. రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిఎం కు విషెస్ చెప్పి మొక్కను బహుకరించారు.. స్పీకర్ ప్రసాద్ కుమార్ , మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యశస్విని తదితరులు రేవంత్ కు పూల బొకే ఇచ్చి ఆంగ్ర సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.. అంతకుముందు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు ఆయన నివాసంలోని సిబ్బంది. నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయం వద్ద రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై

తిరుమల జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కొత్త ఏడాది సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు కలియుగదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు సోమవారం ఉదయం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం రంగనాయకుల మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.మరోవైపు నూతన సంవత్సరం నాడు తిరుమలకు భక్తులు పోటెత్తారు. వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో తిరుమల మాడవీధులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వెంకటేశ్వర నామస్మరణతో మార్మోగుతున్నాయి.

ప్రభుత్వ సేవల కోసం.. కే-స్మార్ట్ యాప్ ప్రారంభించిన కేరళ సీఎం

తిరువనంతపురం, జనవరి 1: ప్రభుత్వ సేవల డిజిటల్ యాక్సెస్ కోసం రూపొందించిన కే-స్మార్ట్ (ఐ-హాఓమీ) యాప్‌ను కేరళ సీఎం పినరయి విజయన్ సోమవారం ప్రారంభించారు. కేరళ సొల్యూషన్స్ ఫర్ వేనేజింగ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ యాప్ ద్వారా స్థానిక పాలనా సంస్థలు అందించే సేవలు ఇకపై పౌరుల చేతికి అందుతాయని తెలిపారు. సమాజంలోని వివిధ రంగాల అభివృద్ధికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇన్ఫర్మేషన్ కేరళ మిషన్ అభివృద్ధి చేసిన ఈ యాప్‌ను మొదట రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో అమలు చేస్తామని చెప్పారు. తర్వాత దశలో ఏప్రిల్ 1 నుంచి గ్రామ పంచాయతీలకు విస్తరిస్తామని అన్నారు.

కాగా, కే-స్మార్ట్ ద్వారా 35 రకాల స్థానిక ప్రభుత్వ సేవలు పొందవచ్చని ప్రభుత్వ అధికారులు తెలిపారు. వెబ్ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యి అవసరమైన సమాచారాన్ని అందించడం ద్వారా ఈ సేవల న్నింటినీ ప్రజలు ఒకే ప్లాట్‌ఫారమ్ ద్వారా పొందవచ్చని చెప్పారు. జననాలు, మరణాలు, వివాహాల నమోదు, వ్యాపార లైసెన్స్‌లు, ఆస్తి పన్నులు వంటి ఎనిమిది సేవలు తొలుత అందుబాటులో ఉంటాయని అధికారులు వివరించారు.

నేటి కందం- నేటికి అందం

ధీరోదాత్తులను-మిగుల
ధీరోద్ధతులను-వెలిగాడు-ధీర లలితులన్
గారవముతోడ గొలువగ
భారతరత్నలను ప్రభుత ప్రారంభించెన్ ?

(2-1-1954 భారతరత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించినరోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

108 స్థలాలలో ఏక కాలంలో సూర్య నమస్కారాలను అత్యంతఎక్కువ మంది పూర్తి చేసిన ప్రపంచ రికార్డును నెలకొల్పినందుకు గుజరాత్‌కు అభినందనలను తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 1:నూట ఎనిమిది స్థలాల లో ఏక కాలం లో సూర్య నమస్కారాల ను పూర్తి చేసే కార్యక్రమం లో అత్యంత ఎక్కువ సంఖ్య లో ప్రజలు పాలుపంచుకొన్న అంశం లో గినీజ్ ప్రపంచ రికార్డు ను నెలకొల్పినందుకు గుజరాత్ కు అబినందనల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న తెలియ జేశారు.

సూర్య నమస్కారం వల్ల గొప్ప ప్రయోజనాల ను అందుకొనేందుకు ఆస్కారం ఉన్నందువల్ల రోజు వారీ పనుల లో సూర్య నమస్కారాన్ని ఒక పని గా మలచుకోవాలి అంటూ ప్రతి ఒక్కరి కి ఆయన విజ్ఞప్తి ని కూడా చేశారు.

"గుజరాత్ ఒక ప్రశంసనీయ మైనటువంటి కార్యం తో 2024 వ సంవత్సరాని కి స్వాగతం పలికింది.. అది ఏమిటి అంటే 108 స్థలాల లో ఏక కాలం లో ప్రజలు అత్యధిక సంఖ్య లో సూర్య నమస్కారాల కార్యక్రమం లో పాలుపంచుకోవడం ద్వారా ఈ అంశం లో గినీజ్ ప్రపంచ రికార్డు ను నెలకొల్పడమైంది. ఆ స్థలాల లో మొఢేరా సూర్య దేవాలయం కూడా ఒకటి గా ఉంది. ఇది నిజానికి యోగ మరియు మన సాంస్కృతిక వారసత్వం ల పట్ల మన యొక్క నిబద్ధత కు ఒక అచ్చమైన నిదర్శన అని చెప్పాలి.

సూర్య నమస్కారాలు చేయడాన్ని మీ యొక్క రోజువారీ పనుల లో ఒక పని గా మలచుకోవలసింది గా మిమ్ముల ను నేను కోరుతున్నాను. దీని ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి." అని పేర్కొన్నారు.

పీఎస్ఎల్‌వీ-సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతంపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం

హైదరాబాద్ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్‌వీ-సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాకెట్ విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేతలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అమెరికా తర్వాత బ్లాక్ హోల్స్‌ను అధ్యయనం చేయడానికి అబ్జర్వేటరీ ఉపగ్రహం ఉన్నరెండో దేశంగా భారతదేశం అవతరించిందన్నారు. కొత్త సంవత్సరం రోజున మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో రోదసిలో భారతదేశ పతాకాన్ని ఎగుర వేసిందన్నారు. పీఎస్ఎల్‌వీ-సీ 58 విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో మరో శిఖరం చేరిందని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బోరుబావిలో పడిన చిన్నారి రక్షణ చర్యల్లో జత కలిసిన ఆర్మీ జవాన్‌లు..

న్యూఢిల్లీ, జనవరి 1:గుజరాత్‌లోని ద్వారక జిల్లా రాణ్ గ్రామంలో బోరుబావిలో పడిన రెండున్నరేళ్ల చిన్నారిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. ఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే జిల్లా అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. తాజాగా ఆర్మీ జవాన్‌లు కూడా ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో జత కలిశారు. మరికొన్ని గంటల్లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బలగాలు కూడా ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో చేరబోతున్నాయి.

ద్వారక జిల్లా కళ్యాణ్‌పూర్ తాలూకాలోని రాణ్ గ్రామంలో ఓ రెండున్నరేళ్ల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు ఉన్న బోరుబావిలో పడిపోయింది. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. బాలికకు ఊపిరాడేందుకు జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులు ఘటనా ప్రాంతంలోనే ఉండి రక్షణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాలికను బయటికి తీయగానే ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు.

డిచ్‌పల్లి పరిధిలో కొకైన్ నిల్వలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నిజామాబాద్ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. అర్ధరాత్రి వేళ డిచ్‌పల్లి పరిధిలో కొకైన్ నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నది. కారులో డ్రగ్స్‌ను తరలిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. కొకైన్‌ను తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. డ్రగ్స్‌ను ఎక్కడికి తరలిస్తున్నారనే విషయాన్ని ఆరాతీస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి విషయాలు తెలియాల్సి ఉన్నది.

నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు..

హైదరాబాద్, జనవరి 1:మెట్రో, ఫార్మా సిటీని రద్దు చేయట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్ట్రీమ్ లైన్ చేస్తున్నామన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మెట్రో దూరం తగ్గిస్తామని స్పష్టం చేశారు. బీహెచ్ఈఎల్ నుంచి విమానాశ్రయానికి 32 కి.మీ దూరం ఉంటుందన్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా నేడు సచివాలయంలో మీడియాతో చిట్ ఛాట్ చేస్తూ, ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా విమానాశ్రయానికి మెట్రో మార్గం ఏర్పాటు చేయనున్నట్లు సీఎం పేర్కొన్నారు. నాగోల్ నుంచి ఎల్బీ నగర్, చాంద్రాయణ గుట్ట వద్ద విమానాశ్రయానికి వెళ్లే మెట్రో లైన్‌కి లింక్ చేయనున్నట్లు చెప్పారు.

. "అవసరమైతే మియాపూర్ నుంచి రామచంద్రాపురం, మైండ్ స్పేస్ వరకు ఉన్న మెట్రోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు పొడిగిస్తాం. మేము కొత్తగా ప్రతిపాదించబోతున్న మెట్రో కారిడార్లు గత ప్రభుత్వం ప్రతిపాదించిన ఖర్చుతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే పూర్తవుతాయి" అని సీఎం వివరించారు.

"ఫార్మాసిటీ, రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య జీరో కాలుష్యం తో ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక క్లస్టర్ల వద్ద పరిశ్రమల్లో పనిచేసే వారికి ఇళ్ల నిర్మాణం చేపడతాం. కార్మికులు హైదరాబాద్ వరకు రాకుండా అక్కడే అన్ని ఏర్పాట్లు చేస్తాం. యువతకు అవసరమైన నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తాం. అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన సంస్థలు, ప్రముఖ పారిశ్రామికవేత్తల ద్వారా శిక్షణ ఉంటుంది. ఈ నైపుణ్యాలకు సాధారణ డిగ్రీలకు ఉండే అర్హతలన్నీ ఉంటాయి" అని సీఎం వివరించారు.

100 పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల..

"ఇప్పటికే అధికారాన్ని వికేంద్రీకరించాం. ఉమ్మడి జిల్లాలకు ఇంఛార్జిలుగా మంత్రులకు బాధ్యతలు అప్పగించాం. 100 పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల ఉంటుంది. విదేశాలకు వెళ్లే యువతకు ఓరియంటేషన్ ఇప్పిస్తాం. ఆయా దేశాలకు అవసరమైన మ్యాన్‌పవర్‌ను ప్రభుత్వం ద్వారా అందిస్తాం. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో యువత ఉంది. వారికి ఆసక్తి కలిగిన విభాగాల్లో శిక్షణ ఇప్పిస్తాం" అని సీఎం తెలిపారు.

నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు..

"మూడు కమిషనరేట్లకు కమిషనర్లను నియమించా. వారికి అవసరమైన సిబ్బందిని వారే ఎంపిక చేసుకుంటారు. శాఖలకు ప్రతిభ కలిగిన అధిపతులను నియమించడం వరకు నేను చూస్తాను. వాళ్ల పరిధిలో అవసరమైన అధికారులను నియమించుకొని యంత్రాంగం సక్రమంగా పనిచేసేలా వారే చూసుకోవాలి. అధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం కూడా జరిగేలా అన్ని చర్యలు

తీసుకుంటున్నాం. సంస్కరణలు తీసుకొచ్చి స్ట్రీమ్ లైన్ చేసే పనిలో ఉన్నాం. నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ నియామకం తర్వాతే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం. జర్నలిస్టులకు సంబంధించిన అన్ని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం. ఇప్పటినుంచి వంద రోజుల్లో పరిష్కరిస్తాం.

3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉంది..

జనవరి 3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పదవులు కేటాయిస్తాం. పార్టీ కోసం పనిచేసిన వారితో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం. నాకు దగ్గరగా ఉంటాడనో.. లేదా బంధువనో.. పదవులు ఇవ్వడం ఉండదు. ఏది చేసినా విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పదవులు భర్తీ చేస్తాం"అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఎక్స్ పోశాట్ విజయవంతంగా ప్రయోగం: ఇస్రో

బెంగళూరు జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);2024 సంవత్సరం తొలిరోజునే భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఎక్స్‌పోశాట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఇదే ఉత్సాహంతో ఈ ఏడాది మరికొన్ని మిషన్లను చేపట్టనున్నది. ఇందులో కీలకమైన గగన్‌యాన్ మిషన్ సైతం ఉన్నది. గగన్‌యాన్‌తో పాటు ఈ ఏడాది 12 నుంచి మిషన్లను చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. 2024 గగన్‌యాన్ మిషన్‌కు సన్నాహక సంవత్సరమని తెలిపారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో 2023లో అబార్ట్ మిషన్ నిర్వహించింది. ఈ ఏడాది మరో రెండు అబార్ట్ మిషన్లను నిర్వహించనున్నట్లు సోమనాథ్ ప్రకటించారు. రెండు మానవరహిత మిషన్లు.. హెలికాప్టర్ డ్రాప్ టెస్ట్, లాంచ్ ప్యాడ్ అబార్ట్ టెస్ట్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు పలు వాల్యుయేషన్ పరీక్షలు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది నింగిలోకి జీఎస్ఎల్‌వీ..

ఈ ఏడాది జీఎస్ఎల్‌వీని సైతం ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ తెలిపారు. ఇన్‌శాట్-3డీఎస్, భారత యుఎస్ సంయుక్తంగా నిర్మించిన నిసార్, సెకండ్ జనరేషన్ నావిగేషన్ ఉపగ్రహాలను జీఎస్ఎల్‌వీ నింగిలోకి మోసుకెళ్లనుందని చెప్పారు. రెండు వాణిజ్య ఉపగ్రహాలను, పీఎస్ఎల్వీ రాకెట్‌తో పలు రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు, ఓ ఎస్ఎస్ఎల్వీ ప్రయోగం సైతం ఉంటాయని వివరించారు. స్క్రామ్ జెట్ ఇంజిన్ పరీక్ష, రీయూజబుల్ లాంచ్ వెహికల్ టెస్ట్‌లను సైతం 2024లో నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది కనీసం 12 మిషన్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హార్డ్‌వేర్ లభ్యతను బట్టి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోశాట్‌పై సైతం సోమనాథ్ స్పందించారు. ఇది ఓ ప్రత్యేక మిషన్ అని పేర్కొన్నారు. దీంతో కృష్ణ బిలాలపై మరింత అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఒక గతేడాది ప్రయోగించి ఆదిత్య ఎల్-1 జనవరి 6న ఎల్-1 పాయింట్‌కు చేరుకుంటుందని వివరించారు.

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి

మెదక్, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): మెదక్ చర్చి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం తొలి దినంతో కావడంతో వేలాదిగా తరలి వచ్చిన భక్తులు, పర్యాటకులతో చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసి పోయింది. ప్రత్యేక ప్రార్థనల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పార్థనల అనంతరం చర్చి ప్రెసిబేటరీ ఇంచార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దేవుని సందేశం చేశారు.

నూతన సంవత్సరంలో ప్రభువు దయతో అందరు సుఖ సంతోషాలు ఆనందోత్సవాలతో గడపలన్నారు. ప్రార్థనల్లో చర్చి పాస్టర్లు శ్రీనివాస్, డేవిడ్, జైపాల్, సువర్ణలు భక్తులను ఆశీర్వదించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సంశాన్ సందీప్, గెలెన్ చిత్తరంజన్, సువన్‌దగ్లస్, జాన్సన్, వికాస్, నోబుల్‌సన్, జాయ్‌ముర్రే, సుశీల్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2000 కరెన్సీ నోట్లు.. 97.38 శాతం వచ్చేశాయి: ఆర్బీఐ

ముంబై, జనవరి 1: ఆర్బీఐ ఇవాళ ఓ ప్రకటన చేసింది. రూ.2000 కరెన్సీ నోట్లు డిసెంబర్ 29వ తేదీ వరకు 97.38 శాతం తిరిగి బ్యాంకుల్లోకి వచ్చినట్లు ఆర్బీఐ చెప్పింది. 2023, మే 19వ తేదీన లావాదేవీలు మూసివేసిన సమయం లో.. సుమారు 3.56 లక్షల కోట్లు విలువ చేసే రెండు వేల నోట్లు చెలామణిలో ఉన్నాయి. డిసెంబర్ 29వ తేదీ వరకు 9,330 కోట్లు ఇంకా చెలామణిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 2023 మే 19వ తేదీ నాటికి అందుబాటులో ఉన్న రెండు వేల నోట్లలో 97.38 శాతం నోట్లు బ్యాంకుల వద్దకు వచ్చినట్లు ఆర్బీఐ తెలిపింది. 2000 కరెన్సీ నోట్లకు ఇంకా లీగల్ గుర్తింపు ఉన్నదని ఆర్బీఐ వెల్లడించింది.

నోట్ల రద్దు సమయంలో ప్రవేశపెట్టిన 2000 నోట్లను .. 2023లో బ్యాంకులు వెనక్కి తీసుకోవడం ప్రారంభించాయి. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీవరకు అన్ని బ్యాంకుల్లో రెండు వేల నోట్లను డిపాజిట్ చేశారు. అక్టోబర్ 9వ తేదీ నుంచి ఆర్బీఐ ఆఫీసుల్లో ఆ నోట్లను తీసుకుంటున్నారు. కొందరు తమ వద్ద ఉన్న రెండు వేల నోట్లను ఇండియా పోస్టు ద్వారా ఇంకా పంపుతున్నారు. బ్యాంక్ అకౌంట్లోలో వారివారి మొత్తాన్ని జమ చేస్తున్న విషయం తెలిసిందే.



విజయ శిఖరాలు అధిరోహించాలంటే?.!

మానసిక పరిపక్వ ప్రశాంతత ఆవహించినపుడు మేఘాలు సహితం మాట్లాడినట్లు, వర్ష చినుకులు అక్షింతలుగా తలను నింపినట్లు, శబ్దాలు కూడా సంగీత రాగాలుగా మారినట్లు, సూర్యోదయాలు సువార్తల వెలుగులు తోడ్కొని వచ్చినట్లు మనిషి మబ్బుల్లో తేలిపోతాడు. మనసు అలసినపుడు, బాధల్లో మునిగినపుడు శశి వెలుగులు సహితం చీకట్లుగా, సుస్వరాలు వికార హేతువులుగా, తీపి పదార్థాలు చేదు రుచులుగా అనుభవంలోకి వస్తాయి.

ప్రపంచమే మన కుటుంబం, మన ఇల్లే పవిత్ర లోకమైనట్లు తోస్తుంది. భయాల కుప్పలు, అభద్రతల తిప్పలు, మానసిక ఒత్తిడి ఆటుపోట్లు దీర్ఘకాలం పాటు అదృశ్యం అవుతాయి. మనిషిని గెలవడం సులభమే కావచ్చు కాని మనసులు గెలవడం కష్టం అని మనకు తెలుసు. ఇతరుల మనసు గెలవాలంటే మన మనసుల్ని మనం జయించాలి, నియంత్రణలో పెట్టాలి. మన సువిశాల అంతరంగం ప్రేమ, పరమానందం, శాంతి, సుఖాలతో నిండి ఉంటే నీ అంతసంపన్నుడు మరొకరు లేరని అర్థం చేసుకోవాలి. దురాశలు, దురాలోచనలు, పగలు ప్రతీకారాలు, విద్వేషాలు లాంటివని మన మనసుకు పట్టిన చెదలుగా తొలిచేస్తాయని భావించాలి.

ఎంచుకున్న లక్ష్యాలను చేరితే జీవన సాఫల్యత సాధించినట్లే. తల్లితండ్రుల పెంపకం, గురు బోధనలు, స్నేహితుల ఆలోచనల ద్వారా పరిణతి, పౌర సమాజం నేర్పే క్రమశిక్షణ, నిరంతర శ్రమ స్వేదం, సమాజ ఎత్తి పొడుపులు లాంటివి మన స్వంతం అయితే మన వెంట పరీక్షా గెలుపు ఫలితాలు ఆహ్వానిస్తాయి. ఉన్నత లక్ష్యాన్ని నిర్ణయించుకోవడం, ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం, మన మనసుతో పాటు పంచేంద్రియాలను నియంత్రించుకుంటూ ఏకాగ్రతతో క్రమశిక్షణాయుత కృషి చేస్తేనే మనం అనుకున్న శిఖరాలను చేరడం సాధ్యపడుతుంది. "మనసును గెలిచి వారు లోకాన్ని సహితం జయించగలడని" మానవ చరిత్ర ఉద్ఘోదిస్తున్నది.

గమ్యస్థానం కన్న ప్రయాణాన్ని ఆస్వాదించడం నేర్చుకోవాలి. ప్రయాణాన్ని ఎంజాయ్ చేస్తే గమ్యం దగ్గరవుతుంది, సులభంగా చేరేందుకు తోడ్పడుతుంది. మనం ఇతరులతో మాట్లాడే ముందు మనతో మనం మాట్లాడుకోవడం అలవర్చుకోవాలి. మన మనసుతో మనం ముచ్చటిస్తూ నిత్య ప్రేరణ, పొరపాట్ల సవరణలు చేసుకుంటూ ముందుకు సాగి పోవాలి.

మనసు మహాశక్తివంతం:

మనిషికి మనసే శక్తివంతమైన ఆస్తి. మనసును సన్మార్గంలో వాడితే ఖ్యాతి స్వంతం అవుతుంది. మనిషంటేనే మనసు అని తెలుసుకోవాలి.

మనిషి మనసు అంటే ఓ దివ్యమైన దేదీప్యమాన వెలుగు. మనసంటే మన హృదయం, ఆత్మ, ప్రవర్తన, కర్మ, ఆలోచన, జ్ఞానం, ఆలోచనాశక్తి, జ్ఞాపకశక్తి అని అర్థం చేసుకుంటాం. భగవంతుడికి పరిచయం కాని మానవ మనసు ఏకాకి మాత్రమే. మన ఆత్మను పరమాత్మ దశకు చేర్చడమే సఫల జీవనయాత్ర. ఓటమికి భయపడుతూ ఆడితే గెలుపు దూరం అవుతుంది. గెలవగలను అనుకుంటూ ఆడితే ఓటమి భయపడి పరుగు తీస్తుంది.

మనసులో స్థిర నమ్మకంతో చేతల్లో దృఢ శక్తి ధార జతగడితే విజయ తీరం దగ్గరవుతుంది. మన మనసును మనమే నియంత్రించుకోవాలి, మరొకరి చేతుల్లో పెట్టరాదు. మన మనసును మనమే వాడితే రాజు అవుతాం, మన మనసును మరొకరి చేతుల్లో పెడితే బానిసవుతాం. మనసును గెలవడానికి యోగా, తపోధ్యానం, ప్రాణాయామం లాంటివి ఉపకరిస్తాయి.

మనసును గెలిచే మార్గాలు:

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి. మన వినూత్న ఆలోచనలతోనే మన జీవితాల్లో సకారాత్మక మార్పు వస్తుంది. మనసు పెట్టి సాధన చేస్తే సాఫల్యత మన స్వంతం అవుతుంది. పనిపై ఏకాగ్రత, అనుకున్న లక్ష్యంపై దృష్టి, సంప్రదాయాలకు దూరంగా వినూత్న ఆలోచనలు జోడించడం, సానుకూల ఆలోచనల సంపద, ధ్యానంతో ఏకాగ్రతను ఏకీకరణం చేయడం లాంటివి మనసును గెలిచే మార్గాలు. మనం అధిగమించగల అతి పెద్ద అవరోధం మన మనసు మాత్రమే అని తెలుసుకోవాలి. సహృదయం అన్నింటికన్న కాంతివంతం. మనం వచ్చింది పోయే దానికి కాదు. మనం పోయిన తర్వాత కూడా జన నాలుకల్లో బతకడానికని తెలుసుకోవాలి. మనసును గెలవడమే గెలుపుకు తొలి సోపానమనే జీవన రహస్యం అర్థం చేసుకోవాలి.

గమ్యం గూర్చి మాత్రమే ఆలోచిద్దాం, అడ్డంకులు/దారి మలుపులు/స్పీడ్ బ్రేకర్స్ గూర్చి కాదు. శత్రువును గెలిచే ముందు మన మనసును గెలవడం నేర్చుకుందాం. లక్ష్యం చేరితే వచ్చే ఫలితం కన్న లక్ష్య సాధనలో ఎదురైన అనుభవాలు మిన్న అని మరువకూడదు. ఇతరుల మనసును గెలిచే ముందు మన మనసును మనమే గెలవడం శుభం పరిణామం. విజేతలు ఎవరూ విలక్షణ పనులు చేయరని, మనం చేసే పనులనే వారు మనసు పెట్టి విభిన్నంగా చేస్తారని తెలుసు కోవాలి. ఇతరుల మనసులు గెలవడానికి ముందు మనం మన మనసులను గెలిచి సాగిపోదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

పొంగులేటి రాఘవ రెడ్డికి నివాళి

ఖమ్మం, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తండ్రి పొంగులేటి రాఘవ రెడ్డి ఆరో సంవత్సరీకాన్ని స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురంలో సోమవారం నిర్వహించారు.

ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి, ఆయన సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులతో పాటు రాఘవరెడ్డి సతీమణి స్వరాజ్యం, ఇతర కుటుంబ సభ్యులు సమాధి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అతిథులతో కలిసి భోజనాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మువ్వా విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం చైర్మన్‌గా అరవింద్ పనగరియ

న్యూఢిల్లీ జనవరి 1: (ఎక్స్ ప్రెస్ న్యూ స్: నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియ ఆర్థిక సంఘం చైర్మన్‌గా నియమితుల య్యారు. అదేవిధంగా రిత్విక్ రంజనమ్ పాండేను ఆర్థిక సంఘం సెక్రెటరీగా నియమించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యుల పదవీకాలం 2025 అక్టోబర్ 31న ముగియనుంది. ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి దాని స్థానంలో తీసుకొచ్చిన నీతి ఆయోగ్‌కు తొలి చైర్మన్‌గా అరవింద్ పనగరియను ప్రధాని మోదీ 2015లో నియమిం చారు.కాగా అరవింద్ పనగరియ 1952 సెప్టెంబర్ 30న జన్మించారు. ఉన్నత విద్యాభ్యాసం అనంతరం న్యూయార్క్‌లోని కొలంబియా యూనివ ర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అంతేగాక ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ంఆః), ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (ఙీూ) లలో పనగరియ వివిధ హోదాల్లో పనిచేశారు.

ప్రెస్ క్లబ్‌లో టీజేఎఫ్ నూతన సంవత్సర వేడుకలు

– కేక్ కట్ చేసి జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ

–ప్రతి జర్నలిస్టు కుటుంబంలో ఈ ఏడాది వెలుగులు నిండాలి: ఆకుతోట



ఖమ్మం, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): నూతన సంవత్సరం 2024 వేడుకలు ఖమ్మం ప్రెస్ క్లబ్లో సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీజేఎఫ్) అనుబంధ ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారా యణ, చిర్రా రవి లు పాల్గొని మాట్లా డారు. ప్రతి జర్నలిస్టు కుటుంబంలో ఈ ఏడాది వెలుగులు నిండాలని, ఆయురారోగ్యాలతో వారి కుటుంబాలు సుఖమయం కావాలని, ఐక్యంగా స్నేహభావంతో జర్నలిస్టులందరూ ము ందుకు సాగాలని వారు ఆకాంక్షిం చారు.

ఈ వేడుకల్లో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, టీఎస్ చక్రవర్తి, పిన్ని సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సహాయ కార్యదర్శి షేక్ జానీ పాషా, జిల్లా నాయకులు మందుల ఉపేందర్, జిల్లా మహిళా ప్రతినిధి వంగూరి ఈశ్వరి, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, కోశాధికారి సీతారామ శాస్త్రి, జిల్లా నాయకులు వల్లూరి సంతోష్, ఉత్కంఠం శ్రీనివాస్, పొన్నెబోయిన పానకాలరావు, యాదగిరి, పులి శ్రీను, బండి కుమార్, ఖాసిం, రోసిరెడ్డి, పప్పుల వేణుగోపాల్, నల్లమోతు శ్రీనివాస్, యాదగిరి, మదార్ సాహెబ్, వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి "2024" కావాలి ఓ నెవర్ బిఫోర్

–పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత "మాచన" సూచన

హైదరాబాద్ జనవరి 1: (ఎక్స్ ప్రెస్ న్యూ స్):పాత సవంత్సరం కు వీడ్కోలు పలికాం..నూతన సంవత్స రాన్ని ఆహ్వానించాం.ఈ వేళ యువత ఆలోచన కొత్త ప్రణాళికలు ఉన్నత లక్ష్యాన్ని సాధించే లా ఉండాలని,ఆ దిశగా నే పథనిర్దేశం చేసుకోవాలని పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత, పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు 2024 సంవత్సరం ప్రారంభం సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. ఓ వ్యక్తి కి జీవితం కాలంలో 365 రోజుల వ్యవధి కాలం సాధారణమైనదని కాదని అభిప్రాయ డ్డారు. యువత ఎంతో విలువైన కాలాన్ని కొన్ని అనవసర ఆలోచన తో,చెడు అలవాట్ల స్నేహం తో.. కాలం వెళ్లబుచ్చడం సరికాదన్నారు. ముఖ్యం గా యువ శక్తి..మత్తు కు చిత్తయ్యే బదులు,ఆ మత్తు నే చిత్తు చేయాలన్నారు.ధూమపానం తదితర చెడు అలవాట్ల వల్ల జీవితం లో అవాంఛనీయమైన పరిణామాలు చోటు చేసుకునే లా పరిస్థితులకు తావివ్వ వద్దని,మన దరిదాపుల్లోకి కూడా ఆ దుస్థితి ని రానివ్వ వద్దని సూచించ ారు.జీవితం లో ప్రతి నిమిషం ఎంతో విలువైనదన్నారు. సమయాన్ని ఒడిసి పట్టే శక్తి మనకు లేదు కాబట్టి,యుక్తి తో సమయాన్ని సద్వినయోగపరచుకుని మనం అనుకున్నది సాధించే లా శ్రమిం చవచ్చని వివరించారు.అందుకే.. విద్యార్థులు,యువత ను 2024 లో వారు ఎంచుకున్న విద్యా అవకాశాల్లో, అయా రంగాల్లో విజయ పథం లో దూసుకెళ్లాలి అని ఆకాంక్షిస్తు న్నట్టు తెలిపారు.2024 ను విజయ వంతమైన వత్సరంగా.. మలచు కోవాలని ఉద్ఘోదించారు. ప్రణాళికా బద్ధమైన కార్యాచరణ తో కొత్త సంవత్సరం లో గొప్ప ,గొప్ప విజయాలు సాధించాలని పిలుపు నిచ్చారు. దురలవాట్లతో జీవితం ఆగమాగం చేసుకోవద్దని "మాచన" హితవు పలికారు. భవిష్యత్ భారతం యువత దే నన్నారు. తాము ఏ రంగాన్ని ఎంచుకున్నా..ఆ యా రం గాల్లో అగ్రగామిగా..నిలిచి ఇతరులకు ఆదర్శమవ్వాలన్నారు కృషి,పట్టుదల, వీటికి తోడు సంకల్ప బలం ఉంటే ఎంతటి భారీ లక్ష్యం ఐనా అవలీలగా అధిగమించవ చ్చన్నారు.అనవసరం గా "అతి" ప్రవర్తన తో చెడ్డ పేరు వచ్చేలా.. బలాదూర్ వద్దని రఘునం దన్ సూచించారు.యువత జల్సా కోసం ఆలోచించడం సహజమే అని. కానీ ఈ జల్సా ల వల్లే కేసుల్లో ఇరుక్కోవడం మంచిది కాదన్నారు.తల్లి దండ్రులు తమ పిల్లల పట్ల విజిలెంట్ గా.. ఉండాలని స్పష్టం చేశారు. 2023 వత్సరం నుంచి నేర్చుకున్న జీవిత పాఠాల తో,2024 ను ఓ గొప్ప మేలు మలుపు కు నాంది పలికేలా.. తీర్చి దిద్ద కోవాలని మాచన రఘునందన్ ఆకాంక్షించారు.

గత ఏడాది సుప్రీం కోర్టు ఇచ్చిన సంచలన తీర్పులు

న్యూ డిల్లీ జనవరి 1: స్వలింగ వివాహం.. ఆర్టికల్ 370 ఎత్తివేత.. జల్లికట్టు.. ఇలా పలు సామాజిక, రాజకీయ అంశాలకు సంబంధించి ఘనమైన తీర్పులను వెలువరించిన ఘనతను ఈ ఏడాది సుప్రీం కోర్టు దక్కించుకుంది. పలు సంచలన తీర్పులకు 2023 సాక్షిభూతంగా నిలిచింది. 2023లో సుప్రీం కోర్టు ఇచ్చిన కొన్ని ప్రధాన తీర్పులను ఒకసారి పరిశీలిద్దాం.

నోట్ల రద్దు సబబే

నల్లధనం వెలికితీతకు 2016లో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది. ఈ నోట్ల రద్దుపై జారీ చేసిన నోటిఫికేషన్ చెల్లుతుందని పేర్కొంటూ 500, 1000 రూపాయల నోట్ల రద్దుపై దాఖలైన పలు పిటిషన్లపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పింది.

జల్లికట్టుకు అనుమతి

ఎద్దులను లొంగదీసుకునే ప్రమాదకరమైన జల్లికట్టు క్రీడకు అనుమతి ఇస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు మే నెలలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం సమర్థించింది.

రాహుల్‌కు ఊరట

ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో జైలు శిక్ష పడ్డ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సుప్రీం కోర్టు ఊరట కలిగించింది. పరువు నష్టం కేసులో రాహుల్‌కు రెండేళ్ల శిక్షతో పాటు ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని సైతం కోల్పోయారు. తనకు పడ్డ శిక్షను రద్దు చేయాలంటూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్లను కింది కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించినప్పటికీ ఈ కేసులో అతనికి పడ్డ శిక్షపై స్టే విధిస్తూ ఆగస్టు 4న సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

స్వలింగ వివాహం చెల్లదు

స్వలింగ వివాహం చెల్లదంటూ అక్టోబర్‌లో ఐదుగురు సభ్యుల ధర్మాసనం చారిత్రక తీర్పు చెప్పింది. సుప్రీం కోర్టు చట్టానికి అర్థం చెప్పి దానిని అమలు చేయగలదే తప్ప, కొత్తగా చట్టాలు చేయలేదని, ప్రత్యేక వివాహ చట్టంలో మార్పు కేవలం పార్లమెంట్ ద్వారానే జరగాలని స్పష్టం చేసింది. స్వలింగ వివాహం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని తీర్పు చెప్పింది. వివాహం చేసుకోవడం ప్రాథమిక హక్కు కాదని పేర్కొంది.

విద్వేష ప్రసంగాలపై కేసులకు ఆదేశాలు

విద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీంకోర్ట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది తీవ్రమైన నేరమని, దీని వల్ల దేశ లౌకిక వాదం ప్రభావితమవుతుందని తెలిపింది. శాంతి భద్రతల సమస్యలు ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. విద్వేష ప్రసంగాలపై ఫిర్యాదులు రాకున్నా కేసులు నమోదు చేయాలని ఆదేశాలిచ్చింది.

ఈ ఏడాది సర్వోన్నత న్యాయస్థానం తీర్పులు గమనిస్తే అనేక ముఖ్యమైన అంశాలపై తీర్పులు వెలువరించడమే కాక, చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక వివాదాలకు పరిష్కారం చూపింది. భవిష్యత్తులో ఆయా అంశాలపై వివాదాలకు తావు లేకుండా కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది.

370 ఆర్టికల్ రద్దు సరైనదే

370వ అధికరణ కింద జమ్ము-కశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక హోదాను 2019లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఎత్తివేయడం సబబేనని డిసెంబర్ 11న సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదా అన్నది ఒక తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, దానిని రద్దు చేసే హక్కు రాజ్యాంగం ప్రకారం సంక్రమించినదేనని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు వెలువరించింది.

న్యూ ఇయర్ వేడుకలో బీఆర్ఎస్ , కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ వ్యక్తి మృతి

కామారెడ్డి జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కామారెడ్డి జిల్లా నుసురా బాద్ మండలం, నాచుపల్లిలో న్యూ ఇయర్ వేడుకల్లో అపస్రుతి చుతుచేసు కుంది.. న్యూ ఇయర్ వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నాయకుడిపై దాడి చేసిన సంఘటన లో కాంగ్రెస్ నేత సాదుల రాములు మృతి చెం దాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.నిన్న రాత్రి నాచు పల్లి గ్రామంలో యువకులు, వివిధ రాజకీయ పక్షాలకు చెందిన వారు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. పార్టీ చేసుకున్నారు. పన్నెండు – ఒంట గంట సమయంలో గ్రామంలో తిరుగుతు న్నప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురుపడ్డారు. గ్రామ కూడలి వద్ద ఇరు పక్షాల మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో కాంగ్రెస్ నేత సాదుల రాములు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



యూట్యూబ్ ఛానల్స్ పెట్టాల్సింది ఉందే!

–అబ్జర్వేషన్‌ను నెటిజన్లతో మాజీ మంత్రి కేటీఆర్ షేర్

హైదరాబాద్ జనవరి 1:(ఎక్స్ ప్రెస్ న్యూ స్):బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆసక్తికర ట్వీట్(ఎక్స్) చేశారు. ఎన్నికల ఫలి తాలు వెల్లడైనప్పటి నుంచి తనకు చాలామంది రకరకాల ఫీడ్‌బ్యాక్‌లు, పరిశీలనలు పంపుతున్నారని తెలిపా రు. అలా తనకు అందిన ఫీడ్‌బ్యాక్స్‌లో బెస్ట్ అనిపించిన ఒక దాన్ని నెటిజన్లతో ట్విట్టర్ వేదికగా ఆయన పంచుకు న్నారు.కేసీఆర్ 32 గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసే బదులు.. ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టే ందుకు 32 యూట్యూబ్ ఛానల్స్ పెట్టాల్సింది అని తనకు వచ్చిన ఒక అబ్జర్వేషన్‌ను నెటిజన్లతో కేటీఆర్ షేర్ చేసుకున్నారు.

అవును మెడికల్ కాలేజీలు బదులు..

నూతన సంవస్సరం పురస్కరించుకొని 100 మంది పేద మహిళలకు చీరెలు పంపిణీ

హైదరబాద్ జనవరి 1: (ఎక్స్ ప్రెస్ న్యూస్),టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్‌పర్సన్ లయన్ డా.కాకుమాను జ్యోతి ఆధ్వర్యం లో నూతన సంవస్సరం పురస్కరించుకొని ప్రాయోజిత పేద ప్రజల సహాయం క్రింద 100 మంది పేద మహిలలకు మందికి కొత్త బట్టలు చీరెలు పంపిణీ చేసారు. ఇందుకు సహకరించిన తార్నాక చారిటబుల్ ట్రస్ట్ సభ్యురాలు జగదాంబ గారిపర్తి,శాంత్ హ కుమారి, కోఆర్డినేట్ చసారు.సభ్యులందరికీ కాకుమాను జ్యోతి ధన్యవాదాలు.

చిరునవ్వుతో రోజును ప్రారంభించండి.. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారు– భువనేశ్వరి

అమరావతి, జనవరి 1:కొత్త ఏడాదిలో ప్రజలు అనుకున్న లక్ష్యాలను సాధించాని, వాటి కోసం చిరునవ్వుతో రోజును ప్రారంభించాలని కోరారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి. నూతన సంవత్సరం సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో నేడు డిజిటల్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఆయనపై స్కిల్ డెవెలప్మెంట్ కేసులో జైలుకు పంపిన సమయంలో 53 రోజులు పాటు చంద్రబాబు కోసం నిలబడిన తెలుగు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కేసులకు భయపడకుండా ప్రజలు బయటకు వచ్చి మాకు అండగా నిలబడ్డారని గుర్తు చేసుకున్న భువనేశ్వరి మీరంతా చంద్రబాబు కోసం నిలబడినందుకు కృతజ్ఞతలు అన్నారు . ముఖ్యంగా మహిళలు నా మనస్సులో ఎప్పటికీ ఉ ండిపోతారన్నారు. ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా చంద్రబాబు కోసం తెలుగు ప్రజలు నిలబడ్డారన్నారు. నూతన ఏడాదిలో అందరూ సంతోషంగా ఉ ండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

సంగారెడ్డి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

సంగారెడ్డి, జనవరి 1: (నేటినిజం ప్రతినిధి):సంగారెడ్డి జిల్లా ప్రజలకు, జిల్లా పోలీసు శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా ప్రజలు సుఖ: సంతోషాలతో, ఆనందాల నడుమ వేడుకలు నిర్వహించుకున్నపుడే మాకు పండగ రోజని, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అర్ధ రాత్రి సంగారెడ్డి చౌరస్తాలో కేక్ కట్ చేసి, జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి, వారి కుటుంబాలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం సవాళ్లతో కూడుకున్న పోలీసు వృత్తిలో ఏరోజుకారోజు కొత్తరకమైన సమస్యలు ఎదురవుతాయని, వాటిని అదిగమించి విధులు నిర్వహించవలసి ఉంటుందన్నారు. ప్రజల సంతోషాలే మనకు వేడుకలని జిల్లా ప్రజల శాంతి భద్రతతో పాటు సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాల గురించి చైతన్య పరుస్తూ, జిల్లా ప్రజల రక్షణలో ఎల్ల వేళలా ముందుంటాం అన్నారు. గత ఏడాదికన్న మెరుగైన ఫలితాలు రాబట్టుకునేందుకు, వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకొని, పెరిగిన సాంకేతికతను వినియోగించుకొని మరిన్ని మంచి ఫలితాలు రాబట్టడానికి కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో రమేష్ కుమార్ డియస్పి సంగారెడ్డి, సుధీర్ కుమార్ సంగారెడ్డి రూరల్ ఇన్స్పెక్టర్, శ్రీధర్ రెడ్డి ఇన్స్పెక్టర్, సదా నాగరాజు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, చంద్రయ్య ఇన్స్పెక్టర్, సబ్-డివిజన్ ఎస్ఐ.లు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు సంఘాలతో పాటు రిజిస్టర్ సంఘాలతో కలిపి సమావేశాలు ఏర్పాటు చేయాలి

-సిఎంకు తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల సంయుక్త పోరాట సమితి

హైదరాబాద్ జనవరి 1: (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ఆయా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసే సందర్భంలో కేవలం గుర్తింపు పొందిన సంఘాలతో మాత్రమే కాకుండా రిజిస్టర్ సంఘాలను కలిపి సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల సంయుక్త పోరాట సమితి (జేఎస్సి)పక్షాన జేఎస్సి చైర్మన్ తిరువరంగం ప్రభాకర్ విజ్ఞప్తి చేసారు.

గత పదేల్ల లో గుర్తింపు పొందిన సంఘాల పేరుతో కొంతమ ంది నేతలు కోట్లాది రూపాయల పాట్ల దండాలు పైరవీలు తప్ప సామాన్య ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆవగింజంతైన న్యాయం లాభం చేకూర్చలేదని విషయాన్ని నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనించి తమ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసే జాయింట్ స్టాప్ కౌన్సిల్ కానీ మరేదైనా సమావేశం కానీ ఏర్పాటు చేసే సందర్భంలో మాత్రమే గుర్తింపు పొందిన మరియు రిజిస్టర్ సంఘాలను కలిపి ఉమ్మడిగా మాత్రమే సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయ ప్రేడ్లి ప్రభుత్వంగా మనగలుగుతుందని ప్రభుత్వానికి కూడా మంచి సలహా సూచనలు అందుతాయని పేర్కొన్నారు.కావున ఈ దశలో తగు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రికి తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల సంయుక్త పోరాట సమితి పక్షాన ప్రభాకర్ విజ్ఞప్తి చేసారు.

అన్ని దారులు శ్రీ సిటీ వైపే



ఖమ్మం, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా, ఉండాలని కోరుకుంటూ ప్రజాఅభీష్టం మేరకు పాలన సాగిస్తూ అహర్నిశలు కృషి చేస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రదాత జిల్లా ముద్దుబిడ్డ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే రాష్ట్ర వ్యవసాయ శాఖ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నూతన సంవత్సరం రోజున ఉమ్మడి ఖమ్మం జిల్లా, నియోజకవర్గ ప్రజలతో గడపాలని ఆలోచనతో శ్రీ సిటీ లోని నివాసంలో అందుబాటులో ఉండటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుండి తుమ్మల అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు జడ్పిటిసిలు, ఎంపీపీలు, ఖమ్మం పట్టణ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వివిధ శాఖల ప్రభుత్వ ఉన్నత అధికారులు తోపాటు దాదాపు గా పదివేల మంది తుమ్మలని కొత్త సంవత్సరపు శుభాకాంక్షలు తెలిపినారు.

ఉదయం 8:00 గంటల నుండి సందర్శకుల తాకిడితో శ్రీ సిటీ ప్రాంతమంతా జన సమూహంగా మారింది. దాదాపు 6:00 గంటలు వారి నివాసంలో ఏర్పాటుచేసిన వేదికపై నిలబడి నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలుపుటకు వచ్చిన అధికారులను, ప్రజా ప్రతినిధులను, పార్టీ నాయకులను, ప్రజలను, అందరిని పేరుపేరునా ఆప్యాయంగా నవ్వుతూ పలకరించినారు. దాంతోపాటు పలువురు ప్రభుత్వ అధికారులు, సంఘాల నాయకులు తెచ్చిన కేకులు కట్ చేస్తూ

పలు శాఖల, సంఘాల డైరీలు క్యాలెండర్లను ఆవిష్కరించారు. మరోవైపు పలు ప్రాంతాల నుండి వచ్చిన తుమ్మల అభిమానులు, పార్టీ నాయకులు కార్యకర్తలను అందరికీ ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తుమ్మల తనయుడు యువజన కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్

సకల ఏర్పాట్లతోపాటు అందరికీ భోజనాలు ఏర్పాటు చేసి వచ్చిన వారిని అందరిని ఆప్యాయంగా నవ్వుతూ పలకరిస్తూ నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలిపారు.

కమర్షియల్ సిలిండర్ పై తగ్గింపు ఎంతంటే....

న్యూఢిల్లీ, జనవరి 1:ఎల్పీజీ సిలిండర్ ధర తగ్గింపుతో కొత్త సంవత్సరం 2024 ప్రారంభమైంది. చమురు మార్కెటింగ్ కంపెనీలు ఈరోజు కొత్త ఎల్పీజీ సిలిండర్ల ధరలను విడుదల చేశాయి. నేడు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకోగా, దేశీయ ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఈరోజు ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ రూ.1755.50కి లభించనుంది. అంతకుముందు ఇది రూ.1757.00. నేడు రూ.1.50 మాత్రమే చవకగా మారింది. అదేవిధంగా కోల్‌కతాలో ఈ సిలిండర్ విలువ రూ.1869.00గా మారింది. అంతకుముందు డిసెంబర్‌లో రూ.1868.50గా ఉంది. ఈరోజు 50 పైసలు పెరిగింది. ముంబైలో రూ.1710కి లభించే కమర్షియల్ సిలిండర్ నేటి నుంచి రూ.1708.50కి అందుబాటులోకి రానుంది. చెన్నైలో ఇప్పుడు రూ.1929కి బదులుగా రూ.1924.50కి విక్రయించబడుతోంది.

నేటికి దేశీయ సిలిండర్లు 30 ఆగస్టు 2023 చొప్పున అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సిలిండర్ ఢిల్లీలో రూ.903కి అందుబాటులో ఉంది. ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్ ప్రకారం, సిలిండర్ ధరలలో చివరిసారిగా 30 ఆగస్టు 2023న భారీ తగ్గింపు జరిగింది. రూ.1103 నుంచి రూ.903కి రూ.200 తగ్గింది. నేడు దేశీయ సిలిండర్ ధర కోల్‌కతాలో రూ.929, ముంబైలో రూ.902.50, చెన్నైలో రూ.918.50గా ఉంది.

మంత్రి రజనీ కార్యాలయంపై రాళ్ల దాడి-టిడిపి,జనసేన కార్యకర్తలు అరెస్ట్ ..

అమరావతి, జనవరి 1:గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో మంత్రి విడదల రజిని కార్యాలయంపై గత అర్ధరాత్రి టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడులు చేశారు. కొత్తగా నిర్మించిన ఆఫీసుపై రాళ్ల దాడికి తెగబడ్డారు. ఫ్లెక్సీలను చించేసి, అద్దాలు ధ్వంసం చేశారు. మంత్రి విడదల రజనిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఆన్చార్జీగా నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె గుంటూరులోని విద్యానగర్ లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కొత్త సంవత్సరం రోజున కార్యాలయం ప్రారంభోత్సవం కావాల్సి ఉంది. అయితే, అర్ధరాత్రి రఈ కార్యాలయంపై టీడీపీ ? జనసేన కార్యకర్తలు దాడి చేశారు.

కాగా, రజని కార్యాలయానికి సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ, జనసేన కార్యకర్తలు రాత్రి పాలాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సమయంలో కొందరు ఆఫీసుపై రాళు రువ్వారు. ఈ దాడిలో ఆఫీసు అద్దాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని, లాఠీఛార్జ్ చేసి అందరినీ చెదరగొట్టారు. కొందరు టీడీపీ, జనసేన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో మంత్రి విడదల రజిని సోమవారం ఉదయం పార్టీ ఆఫీసు వద్దకు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మీడియాతో మాట్లాడుతూ.. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. బీసీ మహిళనైన నన్ను దాడులతో భయపెట్టలేరు. ఇది పక్కా ప్లాన్‌తో జరిగిన దాడి. రాళ్లు తీసుకువచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ దాడి వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదు. అధికార దాహంతోనే ఈ దాడికి పాల్పడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఇదంతా చేస్తున్నారు. పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఉత్తర/మధ్య అరేబియా సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో నిఘా పెంచిన భారత నౌకాదళం

న్యూఢిల్లీ, జనవరి 1:గత కొన్ని వారాలుగా, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్, ఉత్తర/మధ్య అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ రవాణా మార్గాల్లో వ్యాపార నౌకలపై దాడులు పెరిగాయి. భారత తీరానికి దాదాపు 700 నాటికల్ మైళ్ల దూరంలో ఎంవీ రుయెన్‌పై దాడి జరిగింది, ఇటీవల పోర్‌బందర్‌కు నైరుతి దిశలో దాదాపు 220 నాటికల్ మైళ్ల దూరంలో ఎంవీ కెమ్ ప్లూటోపై డ్రోన్ దాడి జరిగింది. ఈ సంఘటనలు భారత ఈఈజడ్‌కు దగ్గరగా ఉన్న సముద్రంలో జరుగుతున్న అలజడిని సూచిస్తున్నాయి.

ఈ ఘటనలకు ప్రతిస్పందనగా, భారత నౌకాదళం మధ్య/ఉత్తర అరేబియా సముద్రంలో నిఘా, బలగాల స్థాయిలను పెంచింది. విధ్వంసక నౌకలు, దాడి నౌకలతో కూడిన నౌకాదళ బృందాలను సముద్ర భద్రత కోసం మోహరించారు. వ్యాపార నౌకలపై దాడులు జరగకుండా ఇవి సాయం చేస్తాయి. సముద్ర ప్రాంతంలో పరిస్థితులపై అవగాహన పెంచుకోవడానికి ఒక సుదూర సముద్ర గస్తీ విమానం, ఆర్‌పీఏల ద్వారా వైమానిక నిఘాను పెంచారు. ఈఈజడ్ భద్రత కోసం భారత నౌకాదళం, తీర రక్షణ దళం సమన్వయంతో పనిచేస్తున్నాయి.

భారత నౌకాదళం జాతీయ సముద్రయాన సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మొత్తం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తుంది. సముద్ర ప్రాంతంలో వ్యాపార నౌకల భద్రత కోసం కట్టుబడి ఉంది.

రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు

-చలికి గజగజ వణికిపోతున్నా ఏజెన్సీ ప్రాంతాలు

హైదరాబాద్, జనవరి 1:ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతాలు చలికి గజగజ వణికిపోతున్నాయి. ఉదయం 8 దాటినా జనాలు ఇండ్లలోకి రావలంటే భయపడుతున్నారు. పొగమంచు కురుస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కుమ్రంభీం జిల్లాలోని సిర్పూర్‌లో అతితక్కువగా 10.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆదిలాబాద్ జిల్లా సోనాలలో 10.8 డిగ్రీలు, నిర్మల్ జిల్లా జామ్‌లో 12.6, మంచిర్యాల జిల్లా నెన్నెలలో 13.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.కాగా, రాష్ట్రాన్ని చలిపులి వణికిస్తున్నది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలితీవ్రత గణనీయంగా పెరిగిపోతున్నది. సూర్యుడు వచ్చినప్పటికీ మంచుదుప్పటి వదలడంలేదు. రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు అలర్ట్ జారీచేసింది. పొగమంచు కారణంగా సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్-ముంబై జాతీయ రహదారిపై ముందు వెళున్న బస్సును మరో బస్సు ఢీకొట్టింది. దీంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.. దీంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.

ఐలోని జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి-మంత్రి కొండా సురేఖ

వరంగల్,జనవరి 1: (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఐలోని జాతర లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. అధికారుల పనితీరులో మార్పు రావాలని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం ఐలోని మల్లికార్జున స్వామిని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్,వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జాతర ప్రాంగణంలో చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, జాతరకు వచ్చే భక్తులు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జాతరలో వృద్ధులకు, మహిళలకు, గర్భిణిలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే.. అత్యవసర సేవలు అందిందేందుకు మూడు అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి. కరెంట్ సరఫరా లో అంతరాయం లేకుండా చూడాలని పేర్కొన్నారు. గతంలో జాతర కంటే..మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

సిద్ధ వంటి సాంప్రదాయ ఆయుష్ వ్యవస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది : ముంజపర మహేంద్రభాయ్

న్యూఢిల్లీ, జనవరి 1:ప్రాచీన సిద్ధ' అభ్యాసకులు సేకరించిన జ్ఞానాన్ని మానవ ఆరోగ్యాన్ని కాపాడటానికి మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈ రోజు 'ప్రాచీన జ్ఞానం మరియు ఆధునిక పరిష్కారాలు' అనే అంశంపై ఈ రోజు డాక్టర్ ముంజపర మహేంద్ర భాయ్, కేంద్ర ఆయుష్ మరియు స్త్రీ మరియు శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి మాట్లాడుతూ అన్నారు. జాతీయ సిద్ధ దినోత్సవం సందర్భంగా. డాక్టర్ ముంజ్‌పరా భారతదేశంలో సిద్ధ వంటి అన్ని సాంప్రదాయ ఆయుష్ వ్యవస్థలను ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయుష్ వ్యవస్థలు మరియు విభాగాల అధ్యయనం అనేక వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స కోసం పర్యావరణ వ్యవస్థను రూపొందించడంలో సహాయపడుతుంది.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధ (ఎన్ఐఎస్) సిద్ధ విధానంలో బోధనకు అత్యున్నత సంస్థగా గుర్తింపు పొందిందని, ఇప్పుడు శిక్షణ పరిశోధనలకు, ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన ప్రమాణాల అభివృద్ధికి చురుగ్గా దోహదపడుతుందని మంత్రి అన్నారు. ఈ సంస్థ బీ వబ ఎం ఎస్, ఎం డీ మరియు సిద్ధలో పీ హెచ్ డీ తో సహా అనేక రకాల విద్య శిక్షణ కార్యక్రమాలను అందిస్తుంది మరియు సిద్ధ అభ్యాసకులకు గొప్ప ఉపాధి అవకాశాలను కూడా అందిస్తుంది. ఇన్‌స్టిట్యూట్ యొక్క ప్రధాన ఆసుపత్రి రోజుకు 2500 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తుంది. సరసమైన ధరలకు 200 పడకల ఇన్‌పేషెంట్ విభాగం కూడా ఉంది.

దేశీయ వైద్యాన్ని ప్రోత్సహించేందుకు తమిళనాడు ప్రభుత్వంలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి చేస్తున్న కృషి పట్ల డాక్టర్ ముంజ్‌పరా సంతృప్తి వ్యక్తం చేశారు. సిద్ధ వైద్య ఆరోగ్య సంరక్షణను సాధారణ ప్రజలకు విస్తరించడం ద్వారా రాష్ట్రం 1079 సిద్ధ యూనిట్లను ఏర్పాటు చేసింది.

ప్రధానమంత్రి చేతుల మీదుగా రూ.15,700 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి పథకాలు ప్రారంభం..

న్యూఢిల్లీ, జనవరి 1:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య క్షేత్రంలో రూ.15,700 కోట్లకుపైగా విలువైన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, జాతికి అంకితం, శంకుస్థాపన చేశారు. వీటిలో అయోధ్య, దాని పరిసర ప్రాంతాల్లోని సుమారు రూ.11,100 కోట్ల విలువైన ప్రాజెక్టులతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన రూ.4600 కోట్ల విలువైన కార్యక్రమాలున్నాయి. దీనికిముందు పునర్నవీకృత అయోధ్య రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన ఆయన, కొత్త అమృత భారత్, వందే భారత్ రైళ్లను జెండా ఊపి సాగనంపారు. వీటితోపాటు అనేక ఇతర రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఆ తర్వాత అయోధ్యలో కొత్త విమానాశ్రయాన్ని ప్రధాని ప్రారంభించి, దీనికి 'మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ- అయోధ్య క్షేత్ర సందర్శనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ పవిత్ర నగరంలో తన రహదారి యాత్ర ఆద్యంతం ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయని పేర్కొన్నారు. "యావత్ ప్రపంచం జనవరి 22 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. ఈ దేశంలోని అణువణువునూ, ప్రతి వ్యక్తినీ నేను ఆరాధిస్తాను. రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించే ఆ రోజు కోసం నేనెంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నాను" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

అండమాన్‌లో 1943 డిసెంబరు 30వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన నేపథ్యంలో ఈ రోజుకుగల చారిత్రక ప్రాధాన్యం గురించి ప్రధాని ప్రస్తావించారు. "స్వాతంత్ర్య ఉద్యమంతో ముడిపడిన ఇలాంటి పవిత్ర దినాన నేడు మనం అమృత కాలపు సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం'' అని ఆయన పేర్కొన్నారు. వికసిత భారతం కార్యక్రమానికి అయోధ్య నుంచి సర్వోత్తేజం లభిస్తోందని చెబుతూ- ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులపై నగర ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టులతో అయోధ్య నగరం జాతీయ పటంలో తిరిగి ప్రముఖ స్థానం పొందుతుందని ఆయన చెప్పారు.

దేశం సరికొత్త ప్రగతి శిఖరాలను అధిరోహించడంలో వారసత్వ పరిరక్షణ కూడా అంతర్భాగమని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఆ మేరకు "నేటి భారతం ప్రాచీనత -ఆధునికతల సమ్మేళనంతో ముందుకు సాగుతోంది" అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, మహిమాన్విత రామ మందిర నిర్మాణం దీనికి నిదర్శనాలని అభివర్ణించారు. డిజిటల్ భారత శకంలో ప్రగతితోపాటు భక్తివిశ్వాస ప్రదేశాల పునరుద్ధరణ చేపట్టామన్నారు; అలాగే 30,000కుపైగా పంచాయతీ భవనాల సరసన కాశీ విశ్వనాథ క్షేత్రం పునర్నిర్మాణం; 315కుపైగా వైద్య కళాశాలల ఏర్పాటు, కేదారనాథ్ క్షేత్ర పునరుద్ధరణ; ఇంటింటికీ కొళాయి నీరు, మహాకాల్ మహాలోక్ నిర్మాణం; విదేశాల నుంచి వారసత్వ కళాఖండాలను తిరిగి తేవడం, అంతరిక్షం-సముద్ర రంగాల్లో విజయాలు తదితరాలను ప్రధానమంత్రి ఉదాహరించారు.

రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ చేయబోవడాన్ని ప్రధాని ప్రస్తావిస్తూ- "ఇవాళ ఇక్కడ ప్రగతి కార్యక్రమాల వేడుక నిర్వహించుకుంటున్నాం... కొన్ని రోజుల తర్వాత సంప్రదాయత వైభవం ఉట్టిపడుతుంది... ఈ రోజు అభివృద్ధి వెలుగులు చూస్తున్నాం.. కొన్ని రోజుల తర్వాత వారసత్వ దివ్య ప్రకాశాన్ని అనుభూతి చెందుతాం. ఈ ప్రగతి-వారసత్వాల సమ్మిళిత శక్తి 21వ శతాబ్దంలో ఆధునిక భారతాన్ని మరింత ముందుకు నడుపుతుంది" అన్నారు. వాల్మీకి మహర్షి వర్ణించిన అయోధ్య ప్రాచీన వైభవాన్ని ప్రస్తావిస్తూ- ఆధునికత అనుసంధానంతో ఈ నగర పూర్వవైభవ పునరుద్ధరణ ఆకాంక్షను ప్రధాని పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో "ఉత్తరప్రదేశ్ సర్వతో ముఖాభివృద్ధికి అవధ్ ప్రాంతం ఒక్కటే కాకుండా అయోధ్య కూడా కొత్త దిశను నిర్దేశిస్తుంది" అని ప్రధాని మోదీ అన్నారు. మహా దేవాలయ ప్రారంభోత్సవం తర్వాత ఈ పవిత్ర నగరానికి వచ్చే యాత్రికులు, పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్న అంచనాలను ప్రస్తావిస్తూ- అందుకు మౌలిక సదుపాయాలను పునర్నవీకరిస్తున్నామని చెప్పారు.

అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టడంపై ప్రధాని హర్షం ప్రకటించారు. వాల్మీకి మహర్షి రామాయణం మనల్ని శ్రీరామునితో మమేకం చేసే జ్ఞానమార్గమని ఆయన పేర్కొన్నారు. ఈ ఆధునిక భారతంలో మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం మనల్ని అయోధ్య క్షేత్రం-ఆధునిక మహా రామాలయంతో అనుసంధానిస్తుందని చెప్పారు. తొలిదశలో ఈ విమానాశ్రయం ఏటా 10 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలను నిర్వహించగలదని, రెండోదశ తర్వాత ఈ సంఖ్య 60 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. ఇక అయోధ్య ధామ్ రైల్వే స్టేషన్ 10 వేల మంది ప్రయాణికుల రాకపోలను నిర్వహిస్తుందని, పునర్నవీకరణ తర్వాత 60 వేల మందికి సేవలందించగలదని తెలిపారు. అదేవిధంగా రామపథం, భక్తి పథం, ధర్మపథం, శ్రీరామ జన్మభూమి పథం, కారు పార్కింగ్‌ల సహా కొత్త వైద్య కళాశాలలు, సరయూ నది కాలుష్య నివారణ, రామ్‌కీ పేడి రూపాంతరీకరణ, ఘాట్‌ల నవీకరణ, పురాతన కుండాల పునరుద్ధరణ, లతా మంగేష్కర్ చౌరస్తా వగైరాలు అయోధ్యకు సరికొత్త గుర్తింపునిస్తాయని, ఈ పవిత్ర నగరంలో కొత్త ఆదాయ-ఉపాధి మార్గాలు అందివస్తాయని తెలిపారు.

వందే భారత్, సమో భారత్ తర్వాత కొత్తగా ప్రవేశపెడుతున్న 'అమృత్ భారత్' రైళ్ల శ్రేణి గురించి ప్రధానమంత్రి వెల్లడించారు. ఈ మేరకు తొలి అమృత భారత్ రైలును అయోధ్య మీదుగా సాగనంపటం ఆనందంగా ఉందన్నారు. ఈ రైళ్లు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, బీహార్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక వెళ్లనున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఆధునిక అమృత భారత్ రైళ్లు పేదలపట్ల సేవాభావనను ప్రతిబింబిస్తాయని ప్రధానమంత్రి ప్రకటించారు. "తమతమ కార్యకలాపాల కోసం తరచూ దూర ప్రయాణం చేసేవారితోపాటు పరిమిత ఆదాయం గలవారికి కూడా ఆధునిక సౌకర్యాలు, సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రావాలి. అందుకే పేదల ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లు రూపొందించబడ్డాయి" అని ఆయన తెలిపారు. ప్రగతిని వారసత్వంతో ముడిపెట్టడంలో వందేభారత్ రైళ్ల పాత్రను కూడా ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. "దేశంలో తొలి వందే భారత్ ఎక్స్ ప్రెస్ కాశీ నుంచి బయల్దేరింది. ఆ తర్వాత ఇప్పుడు దేశవ్యాప్తంగా 34 మార్గాల్లో వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ మేరకు కాశీ, కట్రా, ఉజ్జయిని, పుష్కర్, తిరుపతి, షిర్డీ, అమృత్‌సర్, మదురై వంటి ప్రతి పెద్ద విశ్వాస కేంద్రాన్ని ఇవి అనుసంధానిస్తున్నాయి. ఈ క్రమంలో ఇవాళ అయోధ్యకు వందే భారత్ రైలు కానుకగా లభించింది" అని ప్రధాని మోదీ అన్నారు.

దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రాచీన సంప్రదాయంలో భాగంగా ప్రజలు చేపట్టే 'యాత్ర'ల జాబితాను ఆయన ఏకరవు పెట్టారు. ఆ క్రమంలో అయోధ్య క్షేత్రంలో కల్పించిన సదుపాయాలు ఇక్కడికి భక్తుల యాత్రను మరింత సౌకర్యవంతం చేస్తాయన్నారు. దేశంలోని 140 కోట్ల మంది భారతీయులు శ్రీరామజ్యోతిని వెలిగించాలని ప్రధాని కోరారు. "మనందరి జీవితాల్లో ఈ చారిత్రక ఘట్టం మనకు దక్కిన ఎనలేని అదృష్టం. మనమంతా దేశం కోసం కొత్త సంకల్పం నిర్దేశించుకుని అందులో కొత్త శక్తిని నింపాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రాణ ప్రతిష్ఠకు హాజరుకావాలనే ప్రతి ఒక్కరి ఆకాంక్షను ప్రస్తావిస్తూ- భారీ భద్రత, ఇతరత్రా భారీ సన్నాహాల దృష్ట్యా జనవరి 22 తర్వాత మాత్రమే అయోధ్య పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఆ మేరకు జనవరి 23 తర్వాత అయోధ్య క్షేత్రానికి యాత్ర తేదీని నిర్ణయించుకోవాలని కోరారు. "ఈ పవిత్ర క్షణం కోసం మనం 550 సంవత్సరాలు వేచి చూశాం... దయచేసి, మరికొద్ది రోజులు మాత్రమే ఎదురుచూడండి" అని ఆయన అభ్యర్థించారు.భవిష్యత్తులో అసంఖ్యాక సందర్శకుల రాకపై అయోధ్య ప్రజలను సంసిద్ధులను చేస్తూ- పరిశుభ్రతపై నిశితంగా దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఆ మేరకు అయోధ

కొత్త సంవత్సరం.. ఆలయాలలో పోటెత్తిన భక్త జనం..

తిరుపతి, జనవరి 1:నూతన సంవత్సరం సందర్భంగా ఎపి,తెలంగాణ ఆలయాలు కిటకిటలాడాయి. ఏపీలోని తిరుమల, శ్రీశైలం, సింహాచలంతో పాటు తెలంగాణలో యాదాద్రి, వేములవాడ, భద్రాద్రి, బాసర తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తిరుమల శ్రీవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచీ తరలివచ్చారు. స్వామివారి కృపాకటాక్షాలు తమపై ఉండాలని ప్రార్థించారు. దీంతో శ్రీవారి ఆలయ పరిసరాల్లో కోలాహలం నెలకొంది. శ్రీవారిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దర్శించుకున్నారు. వారికి రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు గవర్నర్ తమిళిసై తెలిపారు. కాగా తిరుమలలో శ్రీవారి దర్శనానికి 14 గంటల సమయం తీసుకుంటున్నది..

తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. కొత్త ఏడాది తొలి రోజు కావడం, మేడారం జాతరకు ముందుగా భక్తులు రాజన్నను దర్శించుకోవడానికి వస్తుండడంతో గర్భాలయంలో ఆర్జిత సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు. ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు.. స్వామి వారికి కోడె మొక్కులను చెల్లించుకుంటున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయం ..

ఓరుగల్లు శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని విశేష పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరం కలిసి రావాలంటూ వేడుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పడుతున్నది. ప్రత్యేక దర్శనానికి 2 గంటలు పడుతున్నది.

చిలుకూరులో పోటెత్తిన భక్త జనం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చిలుకూరు బాలాజీ దేవాలయంలో నేడు మహాద్వారం నుంచి స్వామివారు భక్తులకు దర్శనం కల్పించారు దీంతో భక్తులు పోటెత్తారు..భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆలయ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. 108 ప్రదక్షిణలు నిలిపివేయడంతోపాటు మహాద్వారం (లఘుదర్శనం) నుంచే దర్శనాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు? నాలుగు క్యూల ద్వారా భక్తులను అనుమతించనుండగా, ఆలయానికి కిలోమీటరు దూరంలోనే పార్కింగ్ ఏర్పాటు చేశారు. భక్తులు అక్కడి నుంచి కాలినడకన ఆలయానికి రావాల్సి ఉంటుంది.

కాగా, కొత్త ఏడాది వేళ నేడు దాదాపు లక్షన్నరమంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అంచనా. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక ట్రిప్పులు నడుపుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. అలాగే, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరం 2024లో పాల్గొన్న 2,274 మంది క్యాడెట్‌లు, అత్యధిక సంఖ్యలో పాల్గొన్న 907 మంది బాలికలు

న్యూఢిల్లీ, జనవరి 1:నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) గణతంత్ర దినోత్సవ శిబిరం 2024, దిల్లీ కాంట్‌లోని కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో సర్వ ధర్మ పూజతో డిసెంబర్ 30న ప్రారంభమైంది. ఈ సంవత్సరం 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 2,274 మంది క్యాడెట్‌లు పాల్గొంటున్నారు. ఈ శిబిరం నెల రోజుల పాటు జరుగుతుంది. ఈసారి, అత్యధిక సంఖ్యలో 907 మంది బాలికలు పాల్గొంటున్నారు.

మొత్తం క్యాడెట్లలో జమ్ముడకశ్మీర్, లద్దాఖ్ నుంచి 122 మంది క్యాడెట్‌లు, ఈశాన్య ప్రాంతం నుంచి 171 మంది కూడా ఉన్నారు.

యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా, అర్జెంటీనా, బోట్స్‌వానా, భూటాన్, బ్రెజిల్, చెక్ రిపబ్లిక్, ఫిజీ, కజకిస్తాన్, కెన్యా, కిర్గిజ్‌స్థాన్, లావోస్, మలేషియా, మాల్దీవులు, నేపాల్, రష్యా, సౌదీ అరేబియా, సీషెల్స్, తజికిస్తాన్, యూకే, వెనిజులా, వియత్నాం, శ్రీలంక, సింగపూర్, నైజీరియా, మారిషస్, మొజాంబిక్ వంటి 25 మిత్ర దేశాలకు చెందిన క్యాడెట్లు, అధికారులు కూడా భాగస్వాములయ్యారు.

ప్రారంభ ప్రసంగం చేసిన ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్, క్యాడెట్‌లు మనస్ఫూర్తిగా శిబిరంలో పాల్గొని, ప్రతి కార్యాచరణ నుంచి నేర్చుకోవాలని సూచించారు.

జాతీయ స్ఫూర్తితో మతం, భాష, కులం అనే అడ్డంకులను అధిగమించాలని, చిత్తశుద్ధి, నిస్వార్థ సేవ, సహృదయత, సమష్టి కృషి వంటి అత్యున్నత లక్షణాలను ప్రదర్శించాలని ప్రోత్సహించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లలో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే ప్రాథమిక లక్ష్యంతో గణతంత్ర దినోత్సవ శిబిరాన్ని నిర్వహిస్తారు. ఏటా జరిగే కార్యక్రమంలో క్యాడెట్‌లకు శిక్షణనిస్తారు, సాంస్కృతిక, సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తారు. తద్వారా ఐక్యత, సగర్వాన్ని పెంచుకునే విలువైన అవకాశాలను అందించే వేదికగా ఈ శిబిరం ఉపయోగపడుతుంది.

దక్షిణాది రాష్ట్రాల్లో వినియోగదారుల ఉద్యమాన్ని పటిష్టం చేస్తాం..

-దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్

హైదరాబాద్ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); దక్షిణాది రాష్ట్రాల్లో వినియోగదారుల ఉద్యమాన్ని పటిష్టం చేస్తాం - దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డా. పల్లెపాడు దామోదర్ అన్నారు. హైదరాబాద్ లోని ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య కార్యక్రమంలో పల్లెపాడు దామోదర్ ప్రసంగించారు. ప్రస్తుతం 24 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరు వినియోగదారుల హక్కుల పట్ల ప్రతీ ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని, కాబట్టి వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేస్తూ, వినియోగదారుల సంఘాలు గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకు విస్తృతం అవుతున్న క్రమంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, కాబట్టి పోలీస్ శాఖ సహకారంతో వినియోగదారుల సంఘాలు పనిచేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఇంకా నేటి కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, హైదరాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ చెర్మన్ మామిడి భీం రెడ్డి, ంఎఅచిఐ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శిల్పా రెడ్డి, ంఎఅచిఐ నేషనల్ సెక్రటరీ ఐజాక్ రాజ్, సి.సి.ఐ. సభ్యులు డా. హరిప్రియా రెడ్డి, పాల్గొని ప్రసంగించారు. అనంతరం తదుపరి మూడు సంవత్సరాలకు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి కి అధ్యక్షుడు గా రెండవ మారు ఎన్నికైన డా. పల్లెపాడు దామోదర్ ను రెడ్ క్రాస్ సొసైటీ చెర్మన్ సన్మానించారు.

తుమ్మలకు శుభాకాంక్షలు తెలిపిన బమ్మిడి శ్రీనివాస్ యాదవ్

ఖమ్మం, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరం శ్రీ సిటీలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేపించిన కాంగ్రెస్ నాయకులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, అలాగే తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నియోజవర్గంలో శాసన సభ్యులుగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా ఆయన తిరుమల తిరుపతిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాన్ని మంత్రికి అందజేసి ఆయన ఆశీస్సులు, ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్ కమర్తపు మురళి, కాంగ్రెస్ నాయకులు కమర్తపు రామకృష్ణ, సాదు రమేష్ రెడ్డి, బండి నాగేశ్వరావు, ఎస్ కే బడే సాబ్, జ్యోతి, తోట ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

జనవరి నుంచి 6 వరకు జరిగే సాగర్ పరిక్రమ కార్యక్రమంలో పాల్గొనున్న కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ మంత్రి శ్రీ పర్షోత్తం రూపాలా

న్యూఢిల్లీ, జనవరి 1:ఆంధ్రప్రదేశ్ , పుదుచ్చేరిలో వివిధ ప్రదేశాలలో 2024 జనవరి నుంచి 6 వరకు జరిగే సాగర్ పరిక్రమ (దశ చీ) కార్యక్రమంలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ మంత్రి శ్రీ పర్షోత్తం రూపాలా, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ పాల్గొంటారు.

కార్యక్రమంలో భాగంగా ప్రగతిశీల మత్స్యకారులు, ముఖ్యంగా తీరప్రాంత మత్స్యకారులు,చేపల పెంపకందారులు, యువ మత్స్య పారిశ్రామిక వేత్తలు మొదలైన వారికి కేంద్ర మంత్రులు కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) పంపిణీ చేస్తారు. మత్స్యకారుల ప్రయోజనాల కోసం అమలు జరుగుతున్న ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద అమలు జరుగుతున్న విధానాలు, కార్యక్రమాలు. కేసీసీ లాంటి పథకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్య శాఖ, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్, ఇండియన్ కోస్ట్ గార్డ్, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా లకు చెందిన ఉన్నతాధికారులు, మత్స్యకారుల సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు.

సాగర్ పరిక్రమ యాత్రలో మత్స్యకారులు, చేపల పెంపకందారులు , ఇతర సంబంధిత వర్గాల ప్రతినిధులతో మంత్రి పరస్పర చర్చలుజరుపుతారు. ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలోని కోస్తా జిల్లాల్లో కేసీసీ , ఇతర కార్యకలాపాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారులు ప్రతినిధులు, మత్స్యకారులు, పారిశ్రామికవేత్తలు, మత్స్యకారుల సహకార సంఘం నాయకులు, నిపుణులు, శాస్త్రవేత్తలు మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర వాటాదారులు ఈ కార్యక్రమాల్లో ఖిపాల్గొంటారు.

"సాగర్ పరిక్రమ" మొదటి దశ 2022 మార్చి5 న గుజరాత్‌లోని మాండ్వి నుంచి ప్రారంభమైంది. సాగర్ పరిక్రమ తొమ్మిది దశలు గుజరాత్, డామన్ , దయ్యూ, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, అండమాన్, నికోబార్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి , ఆంధ్రప్రదే శ్‌లోని నెల్లూరు జిల్లాలో కొంత భాగంలో అమలు జరిగాయి. సాగర్ పరిక్రమ దశ-చీ ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన కోస్తా జిల్లాలైన నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, యానాం (పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం)లో జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 974 కిలోమీటర్ల తీరప్రాంతం, 33,227 కిలోమీటర్ల కాంటినెంటల్ షెల్ఫ్ ప్రాంతం కలిగి ఉంది. 555 సముద్ర మత్స్యకారుల గ్రామాలు, 2 ఫిషింగ్ హార్బర్‌లు, 350 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 31147 పడవలు , 65 కోల్డ్ స్టోరేజీలు, 64 ప్రాసెసింగ్ ప్లాంటులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కలిగి ఉంది. 235 ఐస్ ప్లాంటులు , 28 ఫీడ్ మిల్లులు, 357 హేచరీలు మరియు 234 ఆక్వాలాబ్‌లు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న 5 సంవత్సరాల కాలంలో మత్స్య రంగంలో మొత్తం పెట్టుబడి రూ. 2300 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ల నిర్మాణం, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు/ఐస్ ప్లాంట్ల నిర్మాణం, సాంప్రదాయ మత్స్యకారుల కోసం కొత్త డీప్ సీ ఫిషింగ్ వెసెల్‌ల కొనుగోలు, బ్రూడ్ బ్యాంక్ నిర్మాణం, మంచినీటి ఫిన్‌ఫిష్ నిర్మాణం హేచరీలు, ఆక్వాకల్చర్ కోసం విస్తరణ ప్రాంతం, ఫింగర్లింగ్స్ స్టాకింగ్, డిసీజ్ డయాగ్నస్టిక్ అండ్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు, కమ్యూనికేషన్ మరియు ట్రాకింగ్ సంప్రదాయ మరియు మోటరైజ్డ్ నౌకలైన ఎఊఈ/ట్రాన్స్‌పాండర్‌లు మొదలైన కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి.

మత్స్యకార సమాజ సంక్షేమం , తీరప్రాంత అభివృద్ధికి సాగర్ పరిక్రమ కార్యక్రమం అమలు జరుగుతోంది. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, మత్స్యకారుల కిసాన్ క్రెడిట్ కార్డు, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన వంటి కార్యక్రమాల కింద మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సాగర్ పరిక్రమ కార్యక్రమాన్ని చేపట్టింది.

ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం ద్వారా వారి జీవన నాణ్యత, ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరచడంలో సాగర్ పరిక్రమ ప్రభావం చూపుతోంది. సాగర్ పరిక్రమ కింద మత్స్యకారుల సమస్యలను మంత్రులు, అధికారులు స్వయంగా తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరించడంలో సాగర్ పరిక్రమ నిరంతరం సహకరిస్తుంది . వారి ఆర్థిక పురోభివృద్ధిని సులభతరం చేస్తుంది.

అమరవీరుల కుటుంబాలతో పాటు సైనికులు, మాజీ సైనికులు, వారిపై ఆధారపడినవారి సంక్షేమం దేశ సమిష్టి బాధ్యత -రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, జనవరి 1:సురక్షితమైన భారతదేశానికి పునాదిగా నిలుస్తూ, సాటిలేని త్యాగం, నిబద్ధత, దేశభక్తితో వీరమరణం పొందిన అమర వీరుల కుటుంబాల సంక్షేమం, సేవలందిస్తున్న, పదవీవిరమణ చేసిన సైనికులు, వారిపై ఆధారపడిన వారి సంక్షేమాన్ని చూడడం దేశం సమిష్టి బాధ్యత. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన హీరోల పరాక్రమాలను, త్యాగాలను గౌరవించేందుకు, వారి కుటుంబాలకు తోడ్పాటును అందించేందుకు గుజరాత్‌లోని సూరత్‌లో డిసెంబర్ 30, 2023న ఒక ఎన్జీవో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పై వ్యాఖ్యలు చేశారు.

ఈ వీరులకు ఘనంగా నివాళులు అర్పిస్తూ, తమ మాతృభూమి ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని పరిరక్షించే సైనికులకు జాతి ఎప్పటికీ రుణపడి ఉంటుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ప్రభుత్వ విధానమైన తొలుత భారత్, భద్రత మొదట వైఖరికి అనుగుణంగా విజయవంతంగా తమ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తున్న సాయుధ దళాల సిబ్బందిని ఆయన కొనియాడారు. సరిహద్దులు భద్రంగా ఉన్నాయని తెలుసు కనుకనే జాతి నిర్మాణానికి ప్రజలు దోహదం చేస్తున్నారనని ఆయన అన్నారు. దేశం మొత్తాన్ని ప్రకాశింప చేసే ఈ వజ్రాలను తయారు చేసినందుకు ఆయనవారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువతను అసాధారణమైన సైనికులుగా మార్చే ప్రక్రియకు, వజ్రాలను సృష్టించే ప్రక్రియకు మధ్య పోలికలను రక్షణ మంత్రి పట్టి చూపారు. అత్యధిక ఉష్ణోగ్రత, వత్తిడి కర్బన అణువులను వజ్రంగా మార్చినట్టే, సవాళ్ళతో కూడిన పరిస్థితుల కింద సైనికులు దేశాన్ని సేవించడం అన్నది సాధారణ యువతను కూడా వజ్రాలలా మలుస్తుందన్నారు. వారి ప్రకాశంతో, ఈ వజ్రాలు మనను అంధకారం నుంచి కాపాడతాయని ఆయన అన్నారు.

డబ్బును కేవలం ఒక మార్గంగా చూడాలే తప్ప జీవిత అంతిమ లక్ష్యంగా చూడకూడదని ఉద్ఘాటిస్తూ, వ్యక్తిగత లాభాలకన్నా జాతి నిర్మాణానికి ప్రాధాన్యతను ఇవ్వవలసిందిగా వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ అవకాశాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఉపయోగించుకున్నారు. ఆయన గుజరాత్ చారిత్రిక ప్రాముఖ్యతను గురించి, దేశ ప్రగతిలో దాని పాత్ర గురించి కూడా ప్రసంగించారు. తన సాహిత్యం, అంకితభావం ద్వారా సమాజాన్ని ఏకం చేసిన కవి నరసింగ్ మెహతా, మనకు స్వాతంత్ర్యం వచ్చేందుకు కారణమైన జాతి పిత మహాత్మా గాంధీ ఆదర్శాలు ఉ సిద్ధాంతాలు; దఏశ ఐక్యతను ఉ సమగ్రతను బలోపేతం చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠను పెంచి, దేశాన్ని సంపన్నత, భద్రతా పథంలో ముందుకు తీసుకువెళ్తున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ వంటి ప్రముఖులు జన్మించిన రాష్ట్రం గుజరాత్ అన్నారు. వీరితో పాటుగా, తమ జీవితాలను పణంగా పెట్టి మన సరిహద్దుల భద్రతలను కాపాడుతున్న అసంఖ్యాక సైనికులకు కూడా ఇది జన్మస్థలమని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వం సాయుధ దళాలకు అండగా నిలిచి, ముప్పుల నుంచి దేశాన్ని కాపాడేందుకు వారికి అత్యాధునిక ఆయుధాలను, వేదికలను అందిస్తోందని రక్షణ మంత్రి తెలిపారు. ఎటువంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు సైన్యం సిద్ధంగా ఉందని, మనవైపు దుష్ట ఆలోచనలతో కన్నెత్తి చూడాలనుకునే వారు ఎవరికైనా తగిన సమాధానం చెప్తుందని అన్నారు.

కత్రా నుంచి రెండవ వందే భారత్‌ను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 1:కత్రా నుంచి రెండవ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈరోజు ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా-న్యూఢిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను వర్చువల్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి, సిబ్బంది వ్యవహారాలు, పెన్షన్, అణు ఇందనం. అంతరిక్ష వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కత్రా రైల్వే స్టేషన్ నుంచి కార్యక్రమంలో పాల్గొన్నారు.

దీనితో దేశంలో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సౌకర్యం కలిగి ఉన్న ప్రధాన నగరాలలో ఒకటిగా ఒకటిగా కత్రా గుర్తింపు పొందింది.

ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ జితేంద్ర సింగ్ జమ్మూ కాశ్మీర్‌లో 41,000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో రైలు ప్రాజెక్టులు అమలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలోని ఏ కేంద్ర పాలిత ప్రాంతం లేదా రాష్ట్రంలో ఇంత భారీ వ్యయంతో ప్రాజెక్టులు అమలులో లేవని మంత్రి వివరించారు. అదేవిధంగా కేంద్ర బడ్జెట్‌లో జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి 6,000 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించామని ఆయన చెప్పారు. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి శ్రీ నరేంద్ర మోదీ ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించిన వెంటనే శ్రీ మోదీ 2013లో పూర్తయిన కత్రా రైల్వే స్టేషన్‌ని ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు. పవిత్ర నగరం కత్రా అభివృద్ధికి ప్రధానమంత్రి శ్రీ మోదీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి అన్నారు. ఇంతవరకు సరైన రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించే అంశానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ప్రధానమంత్రి ఆదేశాలు జారీ చేసారన్నారు. ఈరోజు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించి జమ్మూ కాశ్మీర్ ప్రజలకు, ముఖ్యంగా కత్రా ప్రజలకు ప్రధానమంత్రి నూతన సంవత్సర కానుక అందించారని డాక్టర్ సింగ్ అన్నారు. గత 50 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను శ్రీ నరేంద్ర మోదీ పరిష్కరించారని మంత్రి అన్నారు. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ప్రధానమంత్రి చూపిస్తున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి అన్నారు. జమ్మూ కాశ్మీర్ లో అమలు జరుగుతున్న రైల్వే ప్రాజెక్టులు ప్రాంత అభివృద్ధికి దోహపడతాయన్నారు.

రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతో జమ్మూ కాశ్మీర్ కు వస్తున్నా పర్యాటకులు, యాత్రికుల సాక్ష్య గణనీయంగా జితేంద్ర సింగ్ తెలిపారు. రికార్డు స్థాయిలో రెండు కోట్ల మందికి పైగా పర్యాటకులు కాశ్మీర్ లోయ ను సందర్శించారని, కోటి మందికి పైగా యాత్రికులు మాతా వైష్ణో దేవిమందిరాన్ని దర్శించారని మంత్రి తెలిపారు. ప్రజలందరికీ నీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి ప్రభుత్వ సేవలు అందుతున్నాయని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులతో (పిఎస్‌బి) వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సమీక్ష

న్యూఢిల్లీ, జనవరి 1:కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి. నిర్మలా సీతారామన్ ఈరోజు న్యూఢిల్లీలో వివిధ అంశాలపై ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్‌బి) పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరాడ్‌తో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ డాక్టర్ వివేక్ జోషి; ఆర్థిక సేవల విభాగం సీనియర్ అధికారులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులు హాజరయ్యారు.

నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఎఆర్‌సిఎల్) ఖాతాల సేకరణ పురోగతిపై కూడా సమావేశంలో చర్చించారు. ఎన్ఏఆర్‌సిఎల్ ద్వారా ఒత్తిడికి గురైన ఖాతాల సేకరణ మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఈ దిశగా అవసరమైన ప్రయత్నాలు చేయాలని ఆర్థిక మంత్రి ఆదేశించారు. ఒత్తిడిలో ఉన్న ఖాతాల ఆన్-బోర్డింగ్‌ను వేగవంతం చేయడానికి ఏఏఆర్‌సిఎల్ మరియు బ్యాంకులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

పై చర్యలకు అదనంగా డిపాజిట్‌లను సమీకరించడం యొక్క ప్రాముఖ్యతను శ్రీమతి. సీతారామన్ నొక్కి చెప్పారు. పిఎస్‌బిలు తమ డిపాజిట్ బేస్‌ను పెంచుకోవడానికి ఆకర్షణీయమైన డిపాజిట్ పథకాలను ఆవిష్కరించాలని మరియు అందించాలని కోరారు. ఇది మరింత క్రెడిట్‌ను విస్తరించడానికి వారికి వీలు కల్పిస్తుందని చెప్పారు.

వోసానికి సంబంధించిన విషయాలపై చర్చల సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి ప్రభుత్వ రంగ బ్యాంకుల మెరుగైన పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ బ్యాంకు మోసాలు వ్యక్తిగత ఖాతాదారులకు మరియు ఆర్థిక సంస్థల భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తాయని పేర్కొన్నారు. ఆర్థిక నష్టాల కారణంగా బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతుందన్నారు.

పెద్ద కార్పొరేట్ మోసాలు మరియు ఉద్దేశపూర్వక డిఫాల్టర్లతో పాటు వ్యక్తిగత కస్టమర్‌లను మోసం చేసే చర్యలపై కూడా దృష్టి పెట్టాలని పిఎస్‌బిలను శ్రీమతి సీతారామన్ కోరారు. అడ్వాన్స్‌డ్ ఫ్రాడ్ ప్రివెన్షన్ అండ్ డిటెక్షన్ మెకానిజమ్‌లను అవలంబించాలని మరియు సురక్షితమైన బ్యాంకింగ్ పద్ధతుల గురించి కస్టమర్‌లకు మరింత అవగాహన కల్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రి బ్యాంకులకు సూచించారు.

హానికరమైన మోసపూరిత కాల్‌ల నుండి రక్షణ కోసం వినియోగదారుల అవగాహన చర్యలను చేపట్టాలని మరియు ఖాతాల్లో వోసాన్ని సకాలంలో గుర్తించడం మరియు వాటి తదుపరి దర్యాప్తు కోసం ప్రయత్నాలు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి బ్యాంకులను ఆదేశించారు. మోసం మరియు ఉద్దేశపూర్వక డిఫాల్టర్గా ప్రకటించబడిన ఖాతాల నుండి రికవరీకి మరింత కృషి చేయ

మాణిక్యమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆర్థికవితరణ

- సహాయంచేయడానికి మంచిమనసుఉండాలి:బీపీ నాయక్

ఖమ్మం, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): బోనకల్ మండల కేంద్రంలోని మాణిక్యమ్మ మెమోరి యల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఏర్పా టుచేసిన ఆంగ్ల నూతన సంవత్సర వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు బీపీ నాయక్. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... రాష్ట్ర ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. ఈ నూతన సంవత్సరంలో కూడా సవాళ్లను ఎదుర్కొంటూ ధైర్యంగా ప్రతి ఒక్కరు విజయం సాధి ంచాలని అభిలాషించారు. ట్రస్ట్ అధినే త అంతోటి శివ అనేక సేవా కార్యక్ర మాలు చేస్తూ మంచి గుర్తింపు పొందా రని ఆలయ నిర్మాణంలో ఉన్న చర్చి పనులకు ఆర్థిక వితరణ చేస్తూ మరోసారి పెద్దమనసు చాటుకున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ నిర్వాహకులు, మహిళలు, ట్రస్ట్ ప్రతినిధులు తదితర నాయకులున్నారు.

టీ తాగేందుకు వెళితే ఆ ముగ్గుర్నీ మృత్యువు కబళించింది..

అమరావతి, జనవరి 1:ప్రకాశం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తెలతెలవారుతుండగానే ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. ఈ ముగ్గురు యువకులు టీ తాగేందుకు వెళుతూ ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్రవిషాదం నెలకొంది..

జిల్లాలోని బెస్తవారి పేట మండలం, శెట్టిచెర్ల అడ్డురోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పాపాయిపల్లికి చెందిన పవన్ (20), రాహుల్ (21), శ్రీనివాస్ (21) అనే ముగ్గురు స్నేహితులు కలిసి టీ తాగేందుకు ద్విచక్రవాహనంపై పందిళ్లపల్లి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలో ఎదురుగా గిద్దలూరు నుంచి బెస్తవారి పేట వైపు వస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మూడు మృతదేహాలను స్వాధీనం చేసుకుని శవపరీక్ష కోసం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు

నేషనల్ కోఆపరేటివ్ డెయిరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ సిడిఎఫ్ఐ) లిమిటెడ్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేసి, ఇ-మార్కెట్ అవార్డ్స్ - 2023 వేడుకలో ప్రసంగించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జనవరి 1:గుజరాత్ లోని గాంధీనగర్ లో నేషనల్ కోఆపరేటివ్ డెయిరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ సిడిఎఫ్ ఐ) లిమిటెడ్ ప్రధాన కార్యాలయానికి కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇ-మార్కెట్ అవార్డ్స్ - 2023 కార్యక్రమంలో ప్రసంగించారు. గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, గుజరాత్ శాసనసభ స్పీకర్ శ్రీ శంకర్ చౌదరి, ఇఫ్కో చైర్మన్ శ్రీ దిలీప్ సంఘాని, ఎన్ డిడిబి చైర్మన్ డాక్టర్ మినేష్ షా, ఎన్ సిడిఎఫ్ఐ చైర్మన్ డాక్టర్ మంగళ్ రాయ్ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో, మన దేశంలో పాడి పరిశ్రమ ముఖ్యంగా సహకార పాడి పరిశ్రమ బహుముఖ లక్ష్యాలను సాధించిందని అన్నారు. సహకార రంగంలో పాల వ్యాపారం జరగకపోతే పాల ఉత్పత్తి మధ్యవర్తికి, పాల వినియోగదారుడికే పరిమితమవుతుందని అన్నారు. 'కానీ సహకార రంగ సహకార పద్ధతిలో పాల వ్యాపారం చేస్తే, దానిలో అనేక కోణాలు మిళితమవుతాయి, ఎందుకంటే లక్ష్యం కేవలం లాభాన్ని ఆర్జించడం కాదు ఇది సమాజానికి, వ్యవసాయానికి, గ్రామాలకు, పాల ఉత్పత్తిదారులకు , అంతిమంగా దేశానికి బహుముఖ ప్రయోజనాలను కలిగి ఉంటుంది. గడచిన 50 ఏళ్లలో భారత్ ఈ విజయగాథను చవిచూసింది' అన్నారు.

ఈ రోజు భారతదేశం 24% వాటాతో ప్రపంచ పాల ఉత్పత్తిలో మొదటి స్థానానికి చేరుకుందని, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, భారతదేశంలో పాల ఉత్పత్తి గత 8 సంవత్సరాలలో సుమారు 51% పెరిగిందని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని, ఇది అత్యంత వేగవంతమైన పెరుగుదల అని సహకార శాఖ మంత్రి అన్నారు. సహకార డెయిరీల ద్వారా ఈ ఉత్పత్తి ఎక్కువగా జరగడం వల్లనే ఇది సాధ్యమైందని శ్రీ షా అన్నారు. సహకార డెయిరీని నడపాలంటే దానిని ప్రోత్సహించడానికి అనేక సంస్థలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఎన్ సి డీఎఫ్ఐ ఈ పని చేస్తుందన్నారు. ఒకరకంగా చెప్పాలంటే అన్ని డెయిరీలకు మార్గనిర్దేశం చేసే పనిని ఎన్ సి డీఎఫ్ఐ చేస్తోంది. శ్వేత విప్లవం 'వాసి' గ్రామం నుంచి ప్రారంభమైందని, ఇప్పుడు అదే ఆనంద్ జిల్లాలో సుమారు 7000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎన్సిడిఎఫ్ఐ ప్రధాన కార్యాలయాన్ని నిర్మించబోతున్నామని శ్రీ షా చెప్పారు. సుమారు రూ.32 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్లాంట్ ను సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా నడపనున్నారు. నూతన ప్రధాన కార్యాలయం భవనం 100 శాతం హరిత భవనంగా ఉంటుందని చెప్పారు.

సహకార రంగం పాడి వ్యాపారం చేసినప్పుడు ముందుగా ప్రయోజనం పొందేది పాల ఉత్పత్తిదారులేనని, ఎందుకంటే వారు దోపిడీకి గురికారని కేంద్ర హోం, సహకార మంత్రి అన్నారు. ఎవరైనా ఒంటరిగా పాలను ఉత్పత్తి చేస్తే, వారికి పాలను నిల్వ చేసే సామర్థ్యం ఉండదని, మార్కెట్ ను అన్వేషించలేరని ఆయన అన్నారు. కానీ సహకార రంగం పాల వ్యాపారం చేస్తే గ్రామ, జిల్లా స్థాయిలో పాల సంఘాలు ఏర్పడి కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్, మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా పాలను ఉత్పత్తిగా మార్చే సామర్థ్యం ఉండి, ఆ తర్వాత లాభాలను సహకార ప్రాతిపదికన పాల ఉత్పత్తిలో నిమగ్నమైన సోదరీమణులతో సహకార ప్రాతిపదికపై పంచుకోగలుగుతారని అన్నారు. ఈ విధంగా చేస్తే పాలు ఉత్పత్తి చేసే సోదరీమణులు దోపిడీ నుంచి విముక్తులు అవుతారని అన్నారు. కేవలం పాల ఉత్పత్తిలో నిమగ్నమైన వ్యక్తి మాత్రమే తన పశువుల ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించ లేడని, అదే సహకార పద్ధతిలో పాలను ఉత్పత్తి చేస్తే, జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం కూడా సంతానోత్పత్తి మెరుగుదల, ఆరోగ్య మెరుగుదల , జంతువుల మంచి ఆహారం కోసం ఏర్పాట్లు చేస్తుందని ఆయన అన్నారు. మూడవ ప్రయోజనం ఏమిటంటే పాల వ్యాపారం సహకార రంగం ద్వారా జరిగితే అది స్వయంచాలకంగా పోషకాహార ఉద్యమంతో ముడిపడి ఉంటుందని చెప్పారు.

పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడే బనస్కాంత డెయిరీతో పాటు ఇలాంటి అనేక డెయిరీల గురించి తనకు తెలుసని శ్రీ అమిత్ షా అన్నారు. అహ్మదాబాద్ డెయిరీ వంటి అనేక డెయిరీలు గర్భిణులు, వారి పిల్లలకు లడ్డూలు ఇచ్చి వారికి పోషకాన్ని అందిస్తున్నాయి. పౌష్టికాహార లోపంపై పోరాటంలో సహకార రంగం మొత్తం భాగస్వామ్యం అయిందన్నారు. ఒకానొక సమయంలో డెయిరీ, డెయిరీ టెక్నాలజీని ఊహించడం కూడా భారత్ కు కష్టంగా ఉండేదని, కానీ తాము భారతదేశం అంతటా సమానంగా పాల ఉత్పత్తి ప్రారంభమయ్యేలా ప్రయత్నాలు చేశామని కేంద్ర సహకార మంత్రి అన్నారు. సహకార డెయిరీతో సంబంధం లేని అనేక రంగాలు ఉన్నాయి, అక్కడ కూడా, ఎన్ డిడిబి ద్వారా, గుజరాత్ లోని సమర్థవంతమైన డైరీలు ఉత్తర ప్రదేశ్ హర్యానా వంటి ఉత్తర భారత రాష్ట్రాలలో తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నా యని, సహకార పద్ధతిలో వ తమ పనిని పెంచుతున్నా యని చెప్పారు. దేశంలోని ప్రతి గ్రామంలో సమన్యాయంతో పాలను ఉత్పత్తి చేయాలని, ప్రతి కుటుంబం స్వయం సమృద్ధి సాధించాలంటే సహకార డెయిరీ ద్వారానే ఈ పని సాధ్యమవుతుందన్నారు.

పాల ఉత్పత్తిలో భారతీయ డెయిరీలు ప్రపంచంలోనే దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాయని శ్రీ అమిత్ షా అన్నారు. 1946లో గుజరాత్ లో డెయిరీ దోపిడీ ప్రారంభించినప్పుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ త్రిభువన్ భాయ్ ను ప్రేరేపించారని, 1946లో 15 గ్రామాల్లో చిన్న డెయిరీలను ప్రారంభించారని గుర్తు చేశారు. దోపిడీకి వ్యతిరేకంగా 1946లో ప్రారంభమైన చిన్న ఉద్యమం పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందిందని, దీని నుంచే దేశంలో శ్వేత విప్లవం, ఎన్ డిబీబీ ఆవిర్భావం మొదలైందని చెప్పారు. నేడు దేశవ్యాప్తంగా అనేక సహకార డెయిరీలు అభివృద్ధి చెందాయన్నారు. అమూల్ ప్రతిరోజూ సుమారు 40 మిలియన్ లీటర్ల పాలను ప్రాసెస్ చేస్తుందని, 36 లక్షల మంది సోదరీమణులు పాలను నిల్వ చేస్తా రని, వారు ఉత్పత్తి చేసిన పాలకు ధరను పొందుతారని చెప్పారు. 2021-22లో అమూల్ ఫెడరేషన్ టర్నోవర్ రూ.72,000 కోట్లు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిజిటల్ రివల్యూషన్ తో పాటు దేశంలో అనేక విప్లవాల ను తీసుకువచ్చారని శ్రీ షా అన్నారు. జి-20 కోసం ప్రపంచం నలుమూలల నుంచి దౌత్యవేత్తలు, రాజకీయ నాయకులు, దేశాధినేతలు ఇక్కడికి వచ్చారని, భారత్ లాంటి దేశంలో ఆన్ లైన్ చెల్లింపులు, డిజిటల్ లావాదేవీలు ఇంతగా ఎలా పెరుగుతాయని అందరూ ఆశ్చర్యపోయారని అన్నారు. ఒక చిన్న పల్లెటూరులో ఒక మహిళ తన మొబైల్ తీసి స్కాన్ చేసి పేమెంట్ చేయడం చూస్తే ఎవరికైనా సంతోషం కలుగుతుందన్నారు. ప్రపంచంలోనే డిజిటల్ లావాదేవీల రంగంలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని, వచ్చే నాలుగైదేళ్లలో మనం అగ్రస్థానానికి చేరుకుంటామని చెప్పారు. దాదాపు 80 దేశాలు మన ఆన్ లైన్ చెల్లింపు వ్యవస్థ విజయం గురించి సమాచారాన్ని కోరా యని, భారతదేశం సంతోషంగా ఈ సమాచారాన్ని అందించడానికి అంగీకరించిం దని చెప్పారు.

పాడి పరిశ్రమలో ఈ-మార్కెట్ ను ప్రోత్సహించినందుకు ఈ రోజు అవార్డులు ఇచ్చినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. ఎన్ సి డీఎఫ్ఐ సభ్యులు 100 శాతం వ్యాపారం వైపు వెళ్లాలని కోరారు. పంచమహల్ జిల్లా డెయిరీ, బనస్కాంత జిల్లా డెయిరీ, గుజరాత్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ సహకారంతో గుజరాత్ లో ఒక చిన్న ప్రయోగాన్ని ప్రారంభించామని సహకార మంత్రి తెలిపారు. 'ప్రతి రైతుకు రూపే కార్డులు ఇస్తున్నాం. ప్రతి గ్రామ డెయిరీని 'బ్యాంక్ మిత్ర'గా మార్చి ఏటీఎంలు ఏర్పాటు చేస్తున్నాం. డెయిరీ, రైతు లందరి ఖాతాలను జిల్లా సహకార బ్యాంకుకు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఒక్క బనస్కాంత జిల్లాలోనే రూ.800 కోట్ల డిపాజిట్లు పెరిగాయని, 193 ఏటీఎంలు పనిచేస్తున్నాయని తెలిపారు. రూపే డెబిట్ కార్డు 96 శాతం మంది రైతులకు చేరింది. ఇప్పుడు రైతు ఎవరి దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదు. వారి పాలకు సంబంధించిన డబ్బును నేరుగా బనస్కాంతలోని జిల్లా సహకార బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. అతడి/ఆమె వద్ద రూపే కార్డు లింక్ చేయబడింది. ఎక్కడి నుంచైనా ఏదైనా కొనుగోలు చేయాలనుకుంటే, నగదు అవసరమైతే గ్రామంలోని డెయిరీ ఏటీఎం నుంచి నగదు తీసుకోవచ్చు. జిల్లాలోని ప్రతి డెయిరీని కేంద్రంగా చేయడం ద్వారా, ఈ నమూనాను మొత్తం గుజరాత్ లో అమలు చేయాలని, అప్పుడు రైతు ఏదైనా కొనుగోలు కోసం తన జేబు నుండి నగదు తీసుకోవలసిన అవసరం ఉండదని శ్రీ షా అన్నారు.

అసంఘటిత ఆర్థిక వ్యవస్థకు బదులుగా దేశ అధికారిక ఆర్థిక వ్యవస్థ , ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడంలో సహకార సంస్థలు ముఖ్యమైన పాత్ర పోషించాలని సహకార మంత్రి అన్నారు. సహకార సంఘాలను ప్రోత్సహించడంలో సహకార సంస్థ ప్రధాన పాత్ర పోషించే ఆర్థిక వ్యవస్థను మనం ఊహించామని ఆయన అన్నారు. మిల్క్ యూనియన్ అధికారులందరూ ఈ నమూనాను అధ్యయనం చేసి ప్రతి జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘానికి పంపితే సహకార రంగం బలం ఎంత పెరిగిందో తెలుసుకోవచ్చు.

ఎన్ సిడిఎఫ్ ఐ సేంద్రియ వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని శ్రీ అమిత్ షా అన్నారు. దాన్ని అమూల్ చాలా బాగా వాడుకుంది. ప్ర ధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్ఫూర్తితో జాతీయ స్థాయిలో బహుళ రాష్ట్ర సహకార సంస్థను ఏర్పాటు చేశామని, ఇది సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్ చేస్తుందని ఆయన తెలిపారు. ప్రజలు దానితో కనెక్ట్ అవ్వడం ప్రారంభించారు. ఈ నమూనాను అవలంబిస్తూ, నేడు ఒక సేంద్రీయ సహకార సంస్థ దేశంలో సేంద్రీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తోంది. సేంద్రియ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ చాలా పెద్దది, ఖరీదైనది కాబట్టి ఎగుమతి కోసం ఒక సహకార సంస్థను కూడా ఏర్పాటు చేశారు. ప్రపంచం ఖరీదైన సేంద్రియ ఉత్పత్తులను వినియోగించాలనుకుంటే వాటిని భారత్ నుంచి పంపడంలో జాప్యం చేయకూడదు.

భారతీయ విత్తనాలను సంరక్షించి ప్రోత్సహించే విత్తన సహకార సంస్థను కూడా ఏర్పాటు చేశామని సహకార మంత్రి తెలిపారు. నేడు పెద్ద పెద్ద విత్తన తయారీ కంపెనీలు బడా రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఎవరికైనా రెండెకరాల భూమి ఉన్నా పీఏసీఎస్ ద్వారా అక్కడికి చేరుకుని విత్తన సాగుతో రైతులను అనుసంధానం చేస్తామన్నారు. దీనివల్ల రైతుకు లాభం పెరుగుతుంది. నోడల్ ఏజెన్సీగా ఎన్సీడీఎఫ్ఐ ఈ విషయంలో వెల్లడైన మంచి నమూనాను ప్రతి జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాలని కోరారు. ఏదైనా జిల్లా యూనియన్ దీన్ని దత్తత తీసుకోవాలనుకుంటే, దానికి మార్గనిర్దేశం చేయడానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయా లని, ఒక జిల్లాలో సాధించిన విజయాన్ని భారతదేశంలోని ప్రతి జిల్లాలో సాధించాలని చెప్పారు.

ఇ -వేలం వేదిక, రివర్స్ వేలం, ఫార్వర్డ్ వేలం కూడా ఇవ్వబోతున్నామని, ఎన్ సిడీఎఫ్ఐ ఈ-మార్కెట్ పోర్టల్ లో లక్ష మెట్రిక్ టన్నుల పప్పుధాన్యాలను కొనుగోలు చేసే వెసులుబాటు కూడా ఉందని అమిత్ షా తెలిపారు. అదేవిధంగా, నాఫెడ్ యాప్ జనవరి 4 న ప్రారంభమవుతుందదని, దీనిలో భారతదేశంలో ఒక రైతు ఎంత పప్పుధాన్యాలను ఉత్పత్తి చేసినా, నాఫెడ్ మొత్తం ఉత్పత్తిని ఎం ఎస్ పి కంటే ఒక రూపాయి ఎక్కువ రేటుకు కొనుగోలు చేస్తుం దని కేంద్ర మంత్రి చెప్పారు. నూనెగింజల రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలని తాము కోరుకుంటున్నామని, అందుకే ఈ పనిని నాఫెడ్ కు అప్పగించామని ఆయన చెప్పారు. రైతు నాఫెడ్ యాప్ లో నమోదు చేసుకుని పప్పుధాన్యాలు సాగు చేస్తారని, అన్ని పప్పుధాన్యాలను ఎం ఎస్ పి కంటే రూపాయి ఎక్కువతో నాఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇథనాల్ కోసం ఒక ప్రపంచ కూటమిని ఏర్పాటు చేశారని, అయితే కూటమిని ఏర్పాటు చేయడానికి ముందే, మొక్కజొన్న నుండి ఇథనాల్ తయారీకి మనం ఒక విధానాన్ని రూపొందించామని సహకార మంత్రి చెప్పారు. ఈ విధానం ప్రకారం రైతు మొక్కజొన్న విత్తితే 100 శాతం మొక్కజొన్నను నాఫెడ్ కొనుగోలు చేసి ఇథనాల్ తయారీ కంపెనీకి పంపితే రైతుకు ఎం ఎస్ పి కంటే ఎక్కువ ధర లభిస్తుందని తెలిపారు. పంటల వైవిధ్యం, తక్కువ ఎరువుల వాడకం, పప్పుధాన్యాలు, నూనెగింజల్లో స్వావలంబన వంటి లక్ష్యాలను మనం నిర్దేశించుకున్నామని శ్రీ అమిత్ షా చెప్పారు.

హనుమంత రెడ్డిని పరామర్శించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): ఇటీవల అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముంజర్లపాటి హనుమంత రెడ్డినీ పరామర్శించినరాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, యండి,ఖాదర్ బాబా, జలగం రామకృష్ణ, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

బాలానగర్‌లో కానిస్టేబుల్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

హైదరాబాద్, జనవరి 1: బాలానగర్ మెజిస్టిక్ గార్డెన్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ఢీకొని కందుకూరి దుర్గయ్య(58) అనే వ్యక్తి మృతి చెందాడు. కానిస్టేబుల్ బైక్ ఢీకొనడం వల్లే దుర్గయ్య మృతి చెందినట్లు పోలీసుల విచారణలో తేలింది.నిందితుడు ఎస్సార్ నగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగాక కానిస్టబుల్ మల్లికార్జున్ అక్కడ్నుంచి పరారీ అయ్యాడు. వారం రోజుల నుంచి మల్లికార్జున్ సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు.

పొగమంచు పరిస్థితుల కారణంగా తగ్గిన దృశ్యమానతను ఎదుర్కొనేందుకు రహదారి భద్రతా చర్యలను చేపట్టిన ఎన్‌హెచ్ఎఐ

న్యూఢిల్లీ, జనవరి 1: శీతాకాలం కారణంగా జాతీయ రహదారులపై తగ్గిన దృగ్గోచరత సమస్యను ఎదుర్కొనేందుకు పలు ఉపశమన చర్యలను తీసుకోవలసిందిగా ఎన్‌హెచ్ఎఐ క్షేత్ర స్థాయి కార్యాలయాలకు ఎన్‌హెచ్ఎఐ చైర్మన్ శ్రీ సంతోష్ కుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. పొగమంచు పరిస్థితుల కారణంగా దృశ్యమానత తగ్గుతూ జాతీయ రహదారులనను వినియోగించే వారి భద్రతకు ప్రధాన ముప్పుగా పరిణమిస్తున్న నేపథ్యంలో హైవేను ఉపయోగించే వారి భద్రతకు ముప్పును తెచ్చే సంభావ్య ప్రమాదాలను నివారించడానికి ఈ చర్యలు తోడ్పడతాయి.

పొగమంచు పరిస్థితుల్లో రహదారి భద్రతను పెంచేందుకు, ఉపశమన చర్యలను ఇంజినీరింగ్ చర్యలు, భద్రతా అవగాహన చర్యలు అన్న రెండు శీర్షికల కింద వర్గీకరించారు. ఇంజినీరింగ్ చర్యలలో రహదారులపై కనిపించని, పాడైన రోడ్డు సైన్లను తిరిగి ఏర్పాటు చేయడం, పేవ్‌మెంట్లపై వేసిన మార్కింగ్ వెలిసిపోయినా, సరిగా లేకపోయినా వాటిని సరి చేయడం, రిఫ్లెక్టివ్ మార్కర్లు, మీడియన్ తదితర భద్రతా పరికరాల ఏర్పాటు ద్వారా దృశ్యమానతను పెంచడం, ఆవాసాలు, ప్రమాదాలకు ఆస్కారమున్న ప్రాంతాల్లో అడ్డుగీతలతో మార్కింగ్‌లు, నిర్మాణ జోన్లలోనూ, ప్రమాదకర ప్రదేశాలలోని మీడియన్ మొదట్లో బ్లింకర్లు పని చేసేలా చూడటం, రహదారి విడిపోయే, కలిసే ప్రదేశాలలో దెబ్బతిన్న ప్రమాద మార్కర్ సంకేతాలను మార్చడం ఉన్నాయి.

జాతీయ రహదారులను వినియోగించే వారికి తగ్గిన దృశ్యమాన పరిస్థితుల గురించి అప్రమత్తం చేసే చర్యలను భద్రతా అవగాహనా చర్యలలో పొందుపరిచారు. ఈ చర్యలలో పొగమంచు వాతావరణ అలెర్టులను ప్రదర్శించేందుకు, పొగమంచు ఉన్న ప్రాంతాలలో డ్రైవింగ్ స్పీడ్ పరిమితిని గంటకు 30కిమీలు మించకుండా ఉండాలని వాహనదారులకు హెచ్చరికలతో కూడిన వేరియబుల్ మెస్సేజ్ సైన్స్ (విఎంఎస్ - మారే సందేశ సంకేతాలు) లేదా ఎలక్ట్రానిక్ సంకేతాల ఏర్పాటు ఉంటాయి. పొగమంచు ఉన్న ప్రాంతాలలో డ్రైవింగ్ స్పీడ్ పరిమితిని గంటకు 30కిమీలు మించకుండా ఉండాలని వాహనదారులకు పబ్లిక్ అడ్రెస్ వ్యవస్థల ద్వారా హెచ్చరికలు, ఎలక్ట్రానిక్ బిల్ బోర్డులు, రేడియోలు, టోల్ ప్లాజాల వద్ద ప్రభుత్వ ప్రకటనలు, సోషల్ మీడియా, పొగమంచు పరిస్థితుల్లో రహదారి వక్కన సౌకర్యాలు, జాతీయ రహదారులపై వాహనాల విస్తీర్ణం మేరకు రిఫ్లెక్టివ్ టేపుల ఏర్పాటు వంటి ఏర్పాట్లు ఉంటాయి.

హైవేలపై ప్రయాణించే వాహనదారులకు బ్లింకర్లను ఉపయోగించి, ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా అవగాహన కల్పించేలా ఎన్‌హెచ్ఎఐ అధికారులనను ఈ మార్గదర్శకాలు ప్రోత్సహిస్తాయి. అదనంగా, భద్రతా అవగాహనకు సంబంధించిన కరపత్రాలను కూడా టోల్ ప్లాజాల వద్ద ప్రయాణీకులకు అందిస్తారు. ఇందులో పొగమంచు పరిస్థితుల గురించి సమాచారాన్ని పంచుకునేందుకు, ప్రమాదాలు జరిగినప్పుడు సహాయం కోసం ఒక కాంటాక్ట్ నెంబర్‌ను కూడా ఇస్తారు.

ఇందుకు అదనంగా, వారం వారం అన్నట్టుగా రాత్రి వేళ హైవేల తనిఖీ చేయవలసిందిగా కూడా ఎన్‌హెచ్ఎఐ క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. తనిఖీ బృందంలో హైవేపై దృశ్యమానతను అంచనా వేసి, అవసరమైనట్లుగా అదనపు ఏర్పాట్లు చేసేందుకు ప్రదేశాలను గుర్తించేందుకు ఎన్‌హెచ్ఎఐ అధికారులు, స్వతంత్ర ఇంజినీర్లు, కన్సెషనైర్/ కాంట్రాక్టర్లు ఉంటారు. అంతేకాదు, దట్టంగా పొగమంచు ఉండే ప్రాంతాల వద్ద హైవే పాట్రోల్ వాహనాలను నిలిపి ఉంచుతారు. హైవేల నిర్వహణ, ఎక్కడైనా ప్రమాదం జరిగిన సందర్భంలోట్రాఫిక్‌ను మళ్ళించేందుకు, మార్గదర్శనం చేసేందుకు పపరేషన్ బృందం ఎరుపు/ ఆకుపచ్చ బ్లింకింగ్ బాటన్ (కర్రను)ను ఉపయోగిస్తూ, స్థానిక పాలన, పోలీసు అధికారులు, అంబులెన్స్ సేవలు, మునిసిపల్ అధికారులతో సాఫీ అయినా సహకారాన్ని కలిగి ఉంటుంది. పొగమంచు సంబంధ ఎమర్జెన్సీలలో ఈ సహకారం సమర్థవంతంగా ఉండేలా నిర్ధారించేందుకు ఎన్‌హెచ్ఎఐ బృందం ఉమ్మడి డ్రిల్స్, వ్యాయామాలు నిర్వహిస్తుంది.

శీతాకాలంలో జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రయాణీకులకు ముప్పును తప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడమే కాక జాతీయ రహదారి వినియోగదారులకు సురక్షితమైన, సాఫీ అయిన ప్రయాణానుభవాన్ని కల్పించేందుకు ఎన్‌హెచ్ఎఐ కట్టుబడి ఉంది.

న్యూఇయర్ వేడుకలు.. అండ్ డ్రైవ్ కేసులు

-హైదరాబాద్‌లో 1500, సైబరాబాద్‌లో 1241 కేసులు నమోదు

హైదరాబాద్ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: రాజధాని హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. చాలా మంది తమ కుటుంబాలతో కలిసి కొత్త ఏడాది వేడుకలు నిర్వహించుకోగా, మరోవైపు యువత ఆనందాన్ని రెట్టింపు చేసేలా హోటళ్లు, పబ్‌లు, రిసార్టులు మిరుమిట్లు గొలిపేలా ఈవెంట్లు నిర్వహించాయి. అర్ధరాత్రి దాటేదాక రోడ్లపై తిరుగుతూ, పటాకులు కాలుస్తూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు. అయితే పోలీసులు ముమ్మరంగా డ్రంక్ డ్రైవ్ (తనిఖీలు నిర్వహించి మందుబాబుల పనిపట్టారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లలో కలిసి 2700కుపైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌లో 1500లకుపైగా కేసులు నమోదవగా, సైబరాబాద్‌లో 1241 కేసులు ఉన్నాయి. ఇక రాచకొండలో 517 మందిపై కేసులు నమోదయ్యాయి. మొత్తంగా మూడు కమిషనరేట్ల పరిధిలో 3500కుపైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.సైబరాబాద్‌లో ఇద్దరు మహిళలతోపాటు తాగి వాహనాలు నడిపన 1239 మందిపై పోలీసులు కేసులు నమోదుచేశారు. తాగి డ్రైవింగ్ చేసిన కేసుల్లో 938 బైకులు, 21 ఆటోలు, 275 కార్లు, 7 భారీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలుచోట్ల పోలీసులతో వాహనదారులు వాగ్వాదానికి దిగారు. కాగా, జంటనగరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నగరంలోని ఫ్లైఓవర్లు, ఓఆర్ఆర్‌ను ఆదివారం రాత్రి 8 గంటలకే మూసివేశారు. పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై విమానం టికెట్ ఉన్నవారికి మాత్రమే అనుమతించారు.

పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కేటీఆర్ మధ్యాహ్న భోజనం

హైదరాబాద్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు.

వారితో కాసేపు ముచ్చటించిన కేటీఆర్.. అనంతరం కలిసి భోజనం చేశారు. కార్మికులతో సెల్ఫీలు దిగారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇక కేటీఆర్‌ను పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై తెచ్చిన కొత్త చట్టాన్ని సవరించాలి..

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది

రాజన్న సిరిసిల్ల, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ఇవాళ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో కొలువుదీరిన శ్రీస్వామి వారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్ స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం మహా మండపంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు రాజన్న ఆలయ ప్రధాన అర్చకులు అప్పల భీమాశంకర్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆశీర్వచనం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ చందన న్యూట్రిషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

రాజన్న సిరిసిల్ల, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): శ్రీ చందన న్యూట్రిషన్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకులు సోమినేని రమ-బాలు కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. శ్రీ చందన న్యూట్రిషన్ రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాక్షించారు. ఈ వేడుకల్లో అల్లాడి కవిత, శ్రీనివాస్, ఈ సుమ, శ్రీనివాస్, ఏ బాబాయి, నర్సయ్య, ఈ శ్రీలత, సుదర్శన్, సౌమ్య, వెంకటేష్, సురేష్, తిరుపతి, మల్లేశం, ఆగయ్య, హరిచరణ్, సుజిత్, దినేష్, భరద్వాజ్, రాకేష్ సుమన పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో ఎంతో ప్రగతి సాధించాం : మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్, జనవరి 1: పద్నాలుగేళ్లు సుదీర్ఘ పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిపామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలో అసంపూర్తిగా నిలిపేసిన ప్రాజెక్టులను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసిందని, ప్రతి ఎకరాకు గోదావరి జలాలను ఇచ్చినట్లు తెలిపారు.

2014 కంటే ముందు తెలంగాణలో 7 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉండేవని, కానీ ఇప్పుడు 25 వేల మెగావాట్లకు పెంచామన్నారు. ఐటీ పరిశ్రమతోపాటు, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేశామన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని అంశాల్లో ముందంజలో నిలిపామని చెప్పారు. కొత్త ఏడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతారని ఆశిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, స్వర్ణలత, రాజనర్సింగరావు, కొండయ్య, గజ్జెల దేవరాజు, మల్లెంకి శ్రీనివాస్, సాయికృష్ణ, గందె కల్పన, వైజయంతి పాల్గొన్నారు.

వెలమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం తనవంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు, నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

శంషుల్ మషాయిఖ్ ఖిలాఫత్, వారసులుగా సయ్యద్ ఖాజా హాశిరోద్దీన్.. హాఫిజ్ ఖాజాబాబా ఎంపిక

-ఉర్సే ఖాద్రీ.. ఉర్స్ శాసహబ్ ఖిబ్లా అలైహిరహ్మా విజయవంతం

కరీంనగర్, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి) ఖలీఫాయే శంశుల్ మశాయిఖ్ సయ్యద్ షా మొహియుద్దీన్ ఖాద్రీ కమాల్ పాషా తన ఖలీఫా, వారసుడిగా సయ్యద్ షా హాశిరోద్దీన్ ఖాద్రీని, మరొక ఖలీఫాగా హాఫిజ్ సయ్యద్ ఖాజాబాబా ఖాద్రీలను ఎంపిక చేశారు. ఆదివారం రాత్రి నగరంలోని షా సాహబ్ మొహల్లాలో జరిగిన సమా ఆధ్యాత్మిక సదస్సులో వీరిద్దరినీ ఎంపిక చేసి, శంశుల్ మశాయిఖ్ సాంప్రదాయం ప్రకారం కార్యక్రమం నిర్వహించి, సర్టిఫికేట్లను అందజేశారు. నారాయే తక్బీర్ అల్లహు అక్బర్ అంటూ నినాదాలు చేశారు. గత శుక్రవారం నుండి ఆదివారం వరకు 81వ ఉర్సే ఖాద్రి, ఉర్స్ షాసాహబ్ అలైహిరహ్మా ఆధ్యాత్మిక సదస్సులు విజయవంతంగా ముగిశాయని నిర్వాహకుడు సయ్యద్ షా హాశిరోద్దీన్ ఖాద్రీ తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా ఉర్స్ హజ్రత్ మీరా సయ్యద్ షా తాజ్ ఉద్దీన్ ఖాద్రీ అల్ జిలానీ అలైహిర్రహ్మ, ఉర్స్ హజ్రత్ మీరా సయ్యద్ షా అబ్దుల్లా క్వాద్రీ అల్ జిలానీ అలైహిర్రహ్మ, ఉర్స్ హజ్రత్ మీరా సయ్యద్ షా ఖాజా మొహియుద్దీన్ క్వాద్రీ అల్ జిలానీ అలైహిర్రహ్మ, ఉర్స్ హజ్రత్ మీరా సయ్యద్ షా గౌస్ మొహియుద్దీన్ క్వాద్రీ అల్ జిలానీ అలైహిర్రహ్మా ఉర్స్ ఉత్సవాలతో పాటు జామా మసీద్ ప్రాంగణంలో ఫజర్ గుసుల్ షరీఫ్ మజార్ పాక్, నాత్ షరీఫ్, మనఖబత్ కార్యక్రమం, ఖాన్ఖా షా సాహబ్, దర్గా సయ్యద్ అలీ షా సాహబ్ వద్ద నిర్వహించారు. జామా మస్జిద్ లో జల్సా ఫైజానే గౌసే అజం రజియల్లాహు అన్హు ఆధ్యాత్మిక సదస్సు జరిగింది. జల్సా అనంతరం లంగర్ పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుంద న్నారు. జామా మసీదు వద్ద సందల్ షరీఫ్ దర్గా సయ్యద్ అలీ షా సాహెబ్ (షా సాహెబ్ వీధి సమీపంలోని ఖాన్ఖా షా సాహబ్ వద్ద మగ్రిబ్ ఫాతేహా అనంతరం ఫాతేహా లంగర్ అన్నదానంతో పాటు మహిఫిల్ సమా కార్యక్రమం అల్హాజ్ సయ్యద్ షా ఖాజా మొహియుద్దీన్ క్వాద్రీ అల్ జిలానీ సాహబ్ (కమల్ పాషా) అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. ఖలీఫా హుజూర్ షంషుల్ మశాయిఖ్, షహ్జాదా గరీబ్ నవాజ్ హజ్రత్ అల్లమా సయ్యద్ హమ్మద్ ఉల్ హసన్ చిస్తీ క్వాద్రీ (అజ్మీర్ షరీఫ్) పర్యవేక్షణలో, హజ్రత్ అల్లామా మౌలానా ముఫ్తీ మహమ్మద్ షాయన్ రజా క్వాద్రీ ఖిబ్లా ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఖాజా అలీముద్దీన్ నిజామీ, మౌలానా ఇద్రీస్, జామా మసీద్ అధ్యక్షుడు సయ్యద్ యూసుఫోద్దీన్ రియాజ్ ఖాద్రి, తల్లత్ ఖాద్రీ, మర్కజి మిలాద్ కమిటీ కార్యదర్శి గులాం రబ్బానీ ఖాద్రీ శంసి, సయ్యద్ అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడను మరింత అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, జనవరి 1: పీర్జాదిగూడను మరింత అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్ ఐఐటీ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ వినాయక మండపాన్ని సోమవారం మేయర్ వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీర్జాదిగూడలో ఇప్పటికే కోట్లాది నిధులతో పలు అభివృద్ధి చేపట్టామని, ఇందులో భాగంగానే మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, యాసారం మహేశ్వరి మహేశ్, అనంతరెడ్డి, హరిశంకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు బడారి రవీందర్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణగౌడ్, బండి శ్రీరాములు, జావిద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు అయోధ్య రామ మందిర్ అక్షింతల వితరణ

రాజన్న సిరిసిల్ల, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్ లో ఉన్న గాయత్రి మాత గుడిలోఅయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలు, ఆహ్వాన పత్రిక, రాముని ఛాయాచిత్రంకు సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు.

అనంతరం మేళా, తాళాలతో గడపగడపకు అక్షింతల వితరణ చేశారు. సుమారు 500 సంవత్సరాల తర్వాత శ్రీరాముడు పుట్టిన అయోధ్యలో భవ్య రామ మందిరనీ జనవరి 22 తేదీన అయోధ్య రామ మందిర్ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రాణ ప్రతిష్ట జరుగుతుందని, కావున అందులో భాగంగా పట్టణంలోఈ కార్యక్రమం జనవరి 15 వరకు జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళలు, యువకులు వివిధ పార్టీల నాయకులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు రామభక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై తెచ్చిన కొత్త చట్టాన్ని సవరించాలి..

నిజామాబాద్, జనవరి 1:రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని వెంటనే సవరించి, డ్రైవర్లకు న్యాయం చేయాలని డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి.దావూద్ అలీ (బాబుజానీ), ప్రధాన కార్యదర్శి నవీద్ పాషా, యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇవాళ నిజామాబాద్ నగరంలోని అర్సపల్లి చౌరస్తా వద్ద తెలంగాణ వెహికల్ పార్కింగ్ వద్ద డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని వదిలి.. ఎప్పుడేం జరుగుతుందోనని భయాందోళనలో గడిపే డ్రైవర్ల పరిస్థితి దుర్భరంగా మారిందని వాపోయారు. రోడ్డు ప్రమాదాల నివారణ పై తీసుకువచ్చిన చట్టంలో 10సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్షల రూపాయల జరిమానా విధించడంపై డ్రైవర్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు న్యాయం జరిగే విధంగా చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించమని యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు వసుదేవ్ సా, జాయింట్ సెక్రెటరీ అనిల్, యూనియన్ సభ్యులు అఫ్జల్, ఫెరోజ్, ఫాహీమ్, రాజు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చందనా దీప్తి

నల్లగొండ, జనవరి 1: నల్లగొండ జిల్లా నూతన ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతలు స్వీకరించారు ఇప్పటి వరకు ఎస్పీగా పనిచేసిన అపూర్వ రావు సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌కి బదిలీ కాగా ఆమె స్థానంలో 2012 బ్యాచ్‌కు చెందిన చందనా దీప్తిబాధ్యతలు స్వీకరించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్పీని అడిషనల్ ఎస్పీ హనుమంతరావు, ఎస్‌బీ డీఎస్పీ సోమ్ నారాయణ్ సింగ్, నల్లగొండ డీఎస్పీ శ్రీదర్ రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్డీ డీఎస్పీ సైదా, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డీపీవో సిబ్బంది ఎస్పీకి స్వాగతం పలికారు.

కరోనా కదలికలు కవితా సంపుటి ఆవిష్కరణ

హైదరాబాద్ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):ఉపాధ్యాయుడు బీసీ ఉద్యమ కారుడు తెలంగాణ కవుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుతారాపు వెంకట నారాయణ రచించిన కరోనా కదలికలు - పుస్తక ఆవిష్కరణ విద్యానగర్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం లో జరిగింది. ఎమ్మెల్సీ.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు.సోషల్ మీడియాను ఉపయోగించుకొని కవులు తమ ఆలోచనలతో సమాజ మార్పుకు చైతన్యానికి దోహద పడాలని ఆర్.కృష్ణయ్య కోరారు. సమకాలీన సమాజాన్ని గమనిస్తూ సమాజం లోని కుళ్ళును కడిగేసి రచనలు సుతారం కలం నుండి జాలువారుతున్నాయని ఆయన అభినందించారు. ఈ సంధర్భంగా జరిగిన కవిసమ్మేళ్ల సంలో 10మంది కవులు కవితా గానం చేశారు. ఎన్వీ రఘువీర్ ప్రతాప్ అనుముల ప్రభాకరా చారి దొంతరబోయిన దైవాదీనం గజవెల్లి దశరథ రామయ్య డాక్టర్.పున్నా విజయ లక్ష్మి రుద్రంగీ రమేశ్ వాలి హుస్సేన్ ఎండీ అబ్దుల్ రషీద్ టీకే చారి కవితా గానం చేశారు. కవి వెంకట నారాయణ తన కవితా ప్రస్థానాన్ని వివరించారు.కవితా గానం చేశారు.కవులను ఆర్. కృష్ణయ్య సత్కరించారు.

2022తో పోలిస్తే మూడు నెలల కనిష్టానికి డిసెంబర్ జీఎస్టీ వసూళ్లు..!

న్యూఢిల్లీ, జనవరి 1: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ వసూళు కొత్త రికార్డులు నెలకొల్పుతున్నాయి. 2022 డిసెంబర్ జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే, గత నెలలో వసూళ్లు పెరిగినా.. మూడు నెలల కనిష్ట స్థాయికి పడిపోయాయి. డిసెంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు 10.28 శాతం పెరిగి రూ.1.65 లక్షల కోట్లకు చేరుకున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. గతేడాది (2022) డిసెంబర్‌లో దాదాపు రూ.1.50 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు జరిగాయి. కానీ, గత నవంబర్‌లో వసూలైన రూ.1.68 లక్షల కోట్ల కంటే తక్కువగా గత నెలలో వచ్చాయి. అక్టోబర్ నెలలో రూ.1.72 లక్షల కోట్ల జీఎస్టీ వసూళు జరిగాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అక్టోబర్ నెల వసూళ్లు రెండో గరిష్టం.'2022 డిసెంబర్‌తో పోలిస్తే, దేశీయ లావాదేవీలతో (సర్వీసుల దిగుమతితోపాటు) గత నెలలో రెవెన్యూ వసూళ్లు 13 శాతానికి పైగా పెరిగాయి' అని కేంద్ర ఆర్థికశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. గత నెలలో సీజీఎస్టీ రూ.30,443 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.37,935 కోట్లు, ఐజీఎస్టీ రూ.84,255 కోట్లు (సరుకుల దిగుమతిపై సుంకం రూ.41,534 కోట్లు), సెస్ రూ.12,249 కోట్లు (సరుకుల దిగుమతితో వచ్చిన సెస్ రూ.1079 కోట్లు కలుపుకుని) వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వరుసగా ఏడోసారి స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.60 లక్షల కోట్ల మార్కును దాటాయి. 2023-24లో డిసెంబర్ వరకు రూ.14.97 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు జరిగాయి. 2022-23తో పోలిస్తే 12 శాతం ఎక్కువ. 2022-23తో పోలిస్తే ఈ ఏడాది రూ.1.49 లక్షల కోట్లు పెరిగాయి.

ఆంజనేయ స్వామి సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జనవరి 1:(నేటినిజం ప్రతినిధి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ పూజారులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి ఆలయ పూజారులు ఆశీర్వచనం చేసి, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్ బింగి మహేష్, కాంగ్రెస్ నాయకులు కనికరపు రాకేష్ , తదితరులు పాల్గొన్నారు.

కొత్త శీర్షిక

ఈ వారం కొత్త కథ

త్వరలో 'నేటి నిజం' దిన పత్రికలో
'ఈ వారం కొత్త కథ' శీర్షికను
ప్రారంభిస్తున్నాము.

ఈ శీర్షికకు రచయితల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.

కథలు చేతిరాతలో నాలుగు పావుతావు పేజీలు మించకూడదు.

డిటిపిలో అయితే
రెండు పేజీలకు మించకూడదు.

ప్రియాంక ఫాంటులో డిటిపి చేయాలి.
ఓపెన్ ఫైలుతో పాటు
పిడిఎఫ్ ఫైలు కూడా పంపాలి.

ప్రచురించే ప్రతి కథకు విశాల సాహితి
300 రూపాయలు పారితోషికాన్ని
బహుమతిగా అందజేస్తుంది.

ఈ శీర్షికను నిర్వహించేందుకు
సుప్రసిద్ధ రచయిత
బి. ఎస్.రాములు గారు అంగీకరించారు.
-బైన దేవదాసు:సంపాదకులు

'నేటినిజం' దినపత్రిక, మాతృశ్రీ నిలయం
ఎస్.ఆర్.టి.169, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020
email: netinizam2020@gmail.com

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.